


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 85 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 5 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 85 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 5 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా!

### కేటీఆర్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన బండి సంజయ్

- సిరిసిల్లను కేటీఆర్ నాశనం చేశారన్న బండి సంజయ్
- తనపై వేల కేసులు పెట్టించారని మండిపాటు
- తనకు భయపడి సిరిసిల్లలోనే మకాం వేశారని ఎద్దేవా

**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను, నాడు మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ పక్కదోవ పట్టించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నిధులను పక్కదారి పట్టించి వరదల్లో సిరిసిల్ల మునిగేలా చేశారని విమర్శించారు. సిరిసిల్లను కేటీఆర్ నాశనం చేశారని అన్నారు. వరదలు వస్తే సిరిసిల్లలో పలు కాలనీలు నీట మునుగుతాయని... కలెక్టరేట్ కూడా మునిగి, జిల్లా కలెక్టర్ ట్రాక్టర్ లో రావాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేటీఆర్ తనపై వేల కేసులు పెట్టించారని బండి సంజయ్ మండిపడ్డారు. ఇప్పుడు కోర్టుల నుంచి నోటీసులు పంపిస్తున్నారని దుయ్యబట్టారు. నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా అని హెచ్చరించారు. నీ అరాచకాలు, నీ నీచ పనులు బయటపెడతానని అన్నారు.

- మిగతా 2లో



## ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

- క్యాన్సర్‌పై అవగాహన పెంచాలని మెగాస్టార్ పిలుపు
- నిర్లక్ష్యం వల్లే ముప్పు.. ముందస్తు గుర్తింపుతోనే రక్షణ
- తనకు జరిగిన కోలనోస్కోపీ టెస్టుపై ఆసక్తికర వ్యాఖ్యలు
- అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తానన్న చిరంజీవి

- మిగతా 2లో

## కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?



- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు

**హైదరాబాద్ పెన్ పవర్:**"భార్యాభర్తలు మాట్లాడుకుంటే దొంగచాటుగా విన్న సన్నాసివి, నువ్వేలా జాతిపిత అవుతావు?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం

- మిగతా 2లో



## మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయి
- బలూచ్ తిరుగుబాటుదారుల వద్ద ఉన్న ఆయుధాలు తమ సైన్యంలో కూడా లేవన్న ఆసిఫ్
- ఈ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయన్న పాక్ రక్షణ మంత్రి
- వీరిపై పాక్ సైన్యం పూర్తి స్థాయిలో దాడి చేస్తుందని వెల్లడి

- మిగతా 2లో



## పవన్ ఆంధ్రాలో రాజకీయాలు చేసుకోవాలి..

### ఇక్కడ ఆయన మాట విని ఓటేసే వారు లేరు: మహేశ్ గౌడ్

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున పవన్ ప్రచారం చేస్తారంటూ వార్తలు
- పవన్ తెలంగాణ వ్యతిరేకి అని ఆరోపించిన మహేశ్ గౌడ్
- పవన్‌ను బీజేపీ నేతలు 'భిక్షాం దేహీ' అని అడిగారంటూ ఎద్దేవా

- మిగతా 2లో

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్ల మంది ఆధార్ నంబర్ల రద్దు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- ఆధార్ భద్రతకు బయోమెట్రిక్ లాక్, ఫేస్ అథెంటికేషన్ ఫీచర్లు
- డేటాబేస్ శుద్ధీకరణలో భాగంగా యూఐడీఏఐ ఈ నిర్ణయం

- మిగతా 2లో




## తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు

- ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని ఆరోపణ
- హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే నోరు మెదపడం లేదని ఆగ్రహం
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరిగే దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హెచ్చరించారు. మహబూబ్ నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 'విజయ సంకల్ప'

- మిగతా 2లో



## ప్రభుత్వాలు శాశ్వతం కాదు

### రాజ్యసభలో కమల్ హాసన్ తొలి ప్రసంగం

- రాజ్యసభలో తొలిసారి ప్రసంగించిన నటుడు, ఎంపీ కమల్ హాసన్
- సినిమా ద్వారానే తాను పార్లమెంటుకు వచ్చానని వెల్లడి
- ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం అశాశ్వతమని వ్యాఖ్య
- ద్రావిడ నేతలు పెరియార్, అన్నాదురైలను గుర్తు చేసుకున్న కమల్
- ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో యువత ఎదగాలని పిలుపు

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎమ్‌ఎన్‌ఎమ్) అధినేత కమల్ హాసన్ రాజ్యసభలో తన తొలి ప్రసంగంతో ఆకట్టుకున్నారు. బుధవారం నాడు బడ్జెట్ సమావేశాల్లో

- మిగతా 2లో



## దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తాం

- దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చడమే లక్ష్యమన్న భట్టి
- సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్ అని వ్యాఖ్యలు
- ప్రజా ప్రభుత్వం సినీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అవార్డులు పునరుద్ధరించిందని వెల్లడి
- కమర్షియల్ అంశాలతో పాటు సామాజిక సందేశం ఉన్న చిత్రాలకు ప్రాధాన్యం అని స్పష్టం
- ఉగాది రోజున ఘనంగా గద్దర్ సినిమా అవార్డుల ప్రదానోత్సవం అని ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా ఉన్న సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. బుధవారం నాడు సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి నగరాల్లో సినీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు పరిమితంగా ఉన్నాయని, కానీ అన్ని భాషల పరిశ్రమలు హైదరాబాద్‌లో అభివృద్ధి చెందడానికి అనేక సానుకూల అంశాలు ఉన్నాయని భట్టి విశ్లేషించారు. సకల భాషల చిత్ర పరిశ్రమలు

- మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..




### ఐటీ రంగంలో విస్తరిస్తున్న హెచ్ఐవీ

- 2020-24 మధ్య కాలంలో ఎయిడ్స్ కారణంగా దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది మృతి
- ఏపీలో 32,642 మంది... తెలంగాణలో 11,498 మంది మృతి
- విదేశీ తరహా జీవనశైలి వల్ల ఐటీ రంగంలో విస్తరిస్తున్న వైరస్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు

తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒక మహోన్నత స్థానం పొందారు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణకర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఆయనకు "తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు" అనే బిరుదు అందించారు. 1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని "గ్రంథాలయోద్యమం" మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం పై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. "జైలు లోపల" అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి.

తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన "ప్రజల మనిషి" అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసారు. వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాథలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు. తెలంగాణా లో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. దాశరథి వట్టికోట కలసి 1948 లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. 1961 ఫిబ్రవరి 5న మరణించారు. వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజాసాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.

# కేసీఆర్.. నువ్వేలా జాతిపిత అవుతావు?

- మొదటి పేజీ తరువాయి

జరిగిన 'ప్రజా పాలన ప్రగతిబాట' భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంతమంది 'జాతిపిత'ను విచారిస్తారా అని అడుగుతున్నారని, అసలు "ఎవరికిరా నువ్వు జాతిపిత? నీ జాతికి నువ్వు పిత కావొచ్చు.. మాకు కాదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ మొత్తం కనుమరుగైనా తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుంది. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతాడు. లులి, సన్నాసి, దొంగ అయిన నువ్వేలా జాతిపిత అవుతావు?" అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడుతూ.. "అన్నం తినేవాళ్లు ఎవరైనా భార్యాభర్తలు మాట్లాడుకుంటే వింటారా? సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముఖాలకు ముసుగులు తొడిగి పోలీసులు విచారణకు తీసుకురావాల్సింది" అని వ్యాఖ్యానించారు. తాము జాతిపిత అయితే కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్, కేటీఆర్ జన్‌వాడ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లతో పాటు వేల కోట్ల ఆస్తులను తెలంగాణ ప్రజలకు రాసిస్తారా అని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కనీసం చిన్న పదవి కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

### స్థానిక నేతపై విమర్శలు, అభివృద్ధి పనులకు శ్రీకారం

సభకు ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో రూ. 200 కోట్లతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావును 'నమ్మకద్రోహి', 'నక్క జిత్తుల వ్యక్తి' అని అభివర్ణించారు. "జానారెడ్డి చెప్పులు, నీళ్లసీసాలు మోసిన భాస్కర్‌రావు, ఎమ్మెల్యేగా గెలిచాక ఆత్మగౌరవాన్ని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు. అలాంటి వ్యక్తికి మళ్లీ ఓటేస్తారా? గంగిరెద్దుల్లా ఓట్లు అడగడానికి వస్తే కర్రు కాల్చి వాత పెట్టండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

### ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. మేము లక్షలాది కార్డులిచ్చి సన్న బియ్యం అందిస్తున్నాం. ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ.6 వేల రైతు భరోసా, రూ.500 బోనస్‌తో పాటు రుణమాఫీ చేశాం. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం" అని ప్రభుత్వ విజయాలను వివరించారు. ఓటు వేసే ముందు ఈ పథకాలన్నింటినీ గుర్తు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ శాఖ తన వద్దే ఉందని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలను అద్దంలా తీర్చిదిద్దే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తాం

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌కు తరలివస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సినీ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని, ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం దశాబ్దాలుగా సినిమా అవార్డులను నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం సినీ రంగానికి తిరిగి పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తోందని భట్టి వివరించారు. సమాజం కోసం, కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. తెలంగాణ కళలు, సంస్కృతి, విప్లవ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి గద్దర్ అని, అందుకే ఆయన పేరు మీద గత ఏడాది నుంచి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డుల ఎంపిక ఉంటుందని భట్టి హామీ ఇచ్చారు. గద్దర్ అవార్డుకు ఎంపికయ్యే సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు బలమైన సామాజిక సందేశం ఉండేలా చూడాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఈ నెల 6 నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 19న ఉగాది పర్వదినం నాడు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో సనాతన ధర్మంపై జరిగే దాడులను సహించేది లేదు

- మొదటి పేజీ తరువాయి

సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ఆరాటపడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపడం లేదని, ఆలయాల భూములు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎందరో పోరాడారని అన్నారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు చూస్తోందని అన్నారు. బలహీనవర్గాలకు న్యాయం జరగలేదని, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత విధిస్తోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను తెలంగాణ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ చెల్లించవలసి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని అన్నారు.

ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,400 కోట్లకు పైగా కేటాయించామని, మూడు హైస్పీడ్ రైల్ రైళ్లను ఇచ్చామని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

# ఆ విషయం తెలియని వాళ్లు నాకు క్యాన్సర్ అని రాశారు

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అవగాహన, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యత గురించి మాట్లాడుతూ, కొన్ని కీలకమైన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. క్యాన్సర్‌పై పోరాటాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని చిరంజీవి వెల్లడించారు. తాను ఎంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తానని, అయినా ముందుజాగ్రత్తగా కోలనోస్కోపీ పరీక్ష చేయించుకున్నానని తెలిపారు. ఆ పరీక్షలో నాన్-క్యాన్సరస్ పాలిప్స్ (అశీఅ-ఖ్రఅఎవతీశీబం జూశీశ్రీఎజూం) కనపడటంతో వాటిని తొలగించారని చెప్పారు. అయితే, దీనిపై అవగాహన లేని కొందరు జర్నలిస్టులు తనకు క్యాన్సర్ వచ్చిందని, దాని నుంచి బయటపడ్డానని రాశారని, అది వాస్తవం కాదని స్పష్టం చేశారు. క్యాన్సర్‌గా మారే చిన్న అవకాశాన్ని కూడా తీసుకోకూడదనే ఉద్దేశంతోనే ఆ పరీక్ష చేయించుకున్నానని అన్నారు. అలాగే, తాను క్రమం తప్పకుండా పీఎస్ఏ (ూూూ) వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటానని తెలిపారు. శరీరం చెప్పే మాటను వినాలని, 'నాకు రాదులే' అనే నిర్లక్ష్యం పనికిరాదని చిరంజీవి గట్టిగా చెప్పారు. తన స్నేహితుడు ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడినా, తొలిదశలోనే గుర్తించడం వల్ల చికిత్సతో బయటపడి గత పదేళ్లుగా ఆరోగ్యంగా జీవిస్తున్నారని ఉదహరించారు. జీవనశైలి, వాతావరణం, వంశపారంపర్య కారణాల వల్ల ఎవరికైనా క్యాన్సర్ రావొచ్చని, కానీ 90 శాతం కేసుల్లో తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు.

ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించాలని చిరంజీవి కోరారు. 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ (హూఎ) వ్యాక్సిన్ వేయిస్తే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (ఎవతీఙఱషబశ్రీ షఱఅఎవతీ) బారిన పడకుండా 100 శాతం రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారని గుర్తుచేశారు. 45 ఏళ్లలోపు మహిళలు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదని సూచించారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గర్భాశయ సంబంధిత సమస్యలను కూడా ముందుగానే గుర్తించవచ్చని ఆయన అన్నారు. భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి నిమిషానికి ముగ్గురు ఈ వ్యాధి బారిన పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చాలంటే పోలియో, మశూచి నిర్మూలన తరహాలో క్యాన్సర్‌పై కూడా ఒక ఉద్యమంలా పోరాడాలని పిలుపునిచ్చారు. పొగాకు, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తనవంతు బాధ్యతగా భవిష్యత్తులో షార్ట్ ఫిలిమ్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నానని చిరంజీవి ప్రకటించారు. ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని కలిసిన కొద్దిరోజులకే కిమ్స్ నుంచి ఆహ్వానం రావడం దైవ సంకల్పంగా భావించానని, అందుకే వెంటనే అంగీకరించానని తెలిపారు.

# 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు.

ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఖ×ణూ×) అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా

- మొదటి పేజీ తరువాయి

తనకు భయపడి సిరిసిల్లలోనే కేటీఆర్ మకాం వేశారని ఎద్దేవా చేశారు. ఓటుకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బలవంతంగా ఏడు గ్రామాలను కలిపి... అక్కడి పేదలకు ఉపాధి హామీ పనులు లేకుండా చేశారని మండిపడ్డారు. సిరిసిల్లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలను కేటీఆర్ సహా అందరికీ పంపిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని... మీరు ఓటు వేస్తే, తాను సిరిసిల్లను అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వ్యభిచారం చేస్తోందని సంజయ్ అన్నారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ... స్పీకర్ కేసు కొట్టేయడం దారుణమని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి... చరిత్రహీనులు కావద్దని సూచించారు.

## ప్రభుత్వాలు శాశ్వతం కాదు

- మొదటి పేజీ తరువాయి

భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏ ప్రభుత్వమూ శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. "వివిధ రంగాలకు చెందిన వారు తమ ప్రజల తరఫున మాట్లాడేందుకు ఈ సభలోకి ప్రవేశించడానికి అనేక ద్వారాలు తెరుచుకుంటాయి. నాకు మాత్రం సినిమా ద్వారా ఆ ద్వారం తెరుచుకుంది" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనకు మద్దతిచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పెరియార్, సి.ఎన్. అన్నాదురై, మహాత్మా గాంధీ వంటి మహనీయుల ప్రభావం తన ఆలోచనలు, రాజకీయాలపై ఉందని పేర్కొన్నారు. "మా భాష, సంస్కృతి, హక్కులపై ఎలాంటి దాడి జరిగినా ఎదుర్కోవాలని నేర్పిన సి.ఎన్. అన్నాదురై నాకు తమిళాన్ని పరిచయం చేశారు" అని కమల్ గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్యంపై మాట్లాడుతూ, "ఈ ప్రజాస్వామ్య రథం భేదాభిప్రాయాలను అధిగమించి ముందుకు సాగాలి కానీ, ప్రజలను అణచివేయకూడదు. దానిని మేము అనుమతించం" అని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలవలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అందుకు అతీతం కాదని స్పష్టం చేశారు. "పిల్లలు గమనిస్తున్నారు, జెన్-జీ తరం చూస్తోంది. ఎదుగుతున్న ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో పాటు వారిని కూడా ఎదగనివ్వండి. అప్పుడే రేపటి భవిష్యత్తు మనదవుతుంది" అని యువతకు పిలుపునిచ్చారు. కమల్ హాసన్ ప్రసంగానికి సభ్యుల నుంచి మంచి స్పందన లభించింది.

# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బలూచిస్థాన్‌లో జరుగుతున్న తిరుగుబాటు దాడులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తిరుగుబాటుదారుల దగ్గర అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఆయుధాలు ఉన్నాయని, అవి పాక్ సైన్యంలో కూడా లేవని ఆయన జాతీయ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ, తిరుగుబాటుదారుల దగ్గర ఒక్కొక్కటి రూ.20 లక్షల విలువైన రైఫిల్స్, 4,0005,000ల డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్, నైట్ విజన్ డివైసెస్ ఉన్నాయని వెల్లడించారు. "ఇలాంటి రైఫిల్ మన సైన్యంలో లేదు. ఈ అమెరికన్ ఆయుధాలు వారికి ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు డబ్బు చెల్లిస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. బలూచ్ తిరుగుబాటుదారుల నాయకత్వం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉందని, అక్కడి నుంచే తిరుగుబాటుదారులకు మద్దతు అందుతోందని ఆసిఫ్ ఆరోపించారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ పరిమాణం పెద్దది కావడం, తిరుగుబాటుదారులు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల భద్రతా బలగాలు కష్టపడుతున్నాయని ఆయన ఒప్పుకున్నారు. పాకిస్థానీ పంజాబీలను బీఎల్ఏ టార్గెట్ చేస్తోందని ఆసిఫ్ తెలిపారు. "వీరితో చర్చలు జరపలేము. పాక్ సైన్యం పూర్తి స్థాయిలో వారిపై దాడి చేస్తుంది" అని హెచ్చరించారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా ఎయిడ్స్ మరణాలు..

ఏపీ, తెలంగాణల్లో ఎయిడ్స్ మరణాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. గత ఐదేళ్లలో హెచ్ఐవీ బారిన పడి మరణించిన వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ప్రకారం... 2020-2024 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా 1.81 లక్షల మంది హెచ్ఐవీ కారణంగా చనిపోయారు. వీరిలో తెలుగు రాష్ట్రాల్లో మరణించిన వారి సంఖ్య 44,140గా ఉంది.

ఏపీలో 32,642 మంది చనిపోగా... తెలంగాణలో 11,498 మంది మృతి చెందారు. మరో షాకింగ్ విషయం ఏమిటంటే... ఐటీ రంగంలో హెచ్ఐవీ వైరస్ విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ విషయాన్ని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థ వెల్లడించింది. విదేశీ తరహా జీవనశైలికి అలవాటు పడటం ఐటీ రంగంలో హెఐవీ వ్యాప్తి కావడానికి కారణమవుతోందని తెలిపింది. ఈ రంగంలో హెచ్ఐవీ పరీక్షల సంఖ్యలను పెంచాల్సి ఉందని సూచించింది.

# కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హైడ్రా..

## ప్రతి శనివారం ఫోన్-ఇన్ ద్వారా ఫిర్యాదులకు అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్కులు, కుంటలు, చెరువులు సంరక్షించడమే లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా.. ఎన్నో వేల ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడింది. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకునే హైడ్రా.. లేటెస్టుగా మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇక నుంచి నగరవాసులు ఫోన్ ఇన్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చునని బుధవారం (ఫిబ్రవరి 04) ప్రకటనలో తెలిపింది.ప్రతి శనివారం ఫోన్ ఇన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్న హైడ్రా అధికారులు. హైడ్రా కమిషనర్ తో నేరుగా మాట్లాడి ఫిర్యాదులు చేసే అవకాశం కల్పిస్తున్నారు. ఈ శనివారం నుంచే

- మిగతా 4లో...

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్



మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..



## ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ నమోదు ప్రక్రియ...

# వేగవంతం చేయండి

## మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి..

- జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన 9,10వ తరగతి విద్యార్థులకు..
- కుల-ఆదాయ ధృవీకరణల్లో జాప్యం వద్దు
- ఎస్సీ 9,10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్..
- ప్రత్యేక దృష్టి సారించి ధృవీకరణలు వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు..
- నమోదు ప్రక్రియ నుంచి ధృవపత్రాల జారీ వరకు ప్రధానోపాధ్యాయులదే బాధ్యత..
- బ్యాంక్/పోస్టల్ అకౌంట్ల ప్రారంభంలో విద్యార్థులకు మార్గనిర్దేశం..
- https: //www.tgepass .cgg.gov.in లో ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచనలు..

జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన 9,10 వతరగతి విద్యార్థులు అర్హులు మరియు కుటుంబ ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉండాలాన్నారు. ఆధార్, కుల,ఆదాయ ధృవీకరణలతో పాటు బోనఫైడ్, పాస్ పోర్టు సైజ్ ఫోటో బ్యాంక్ అకౌంట్/ పోస్టల్ అకౌంట్ కలిగి ఉన్న విద్యార్థులు ఈ పాస్ వెబ్ సైట్ https://www.tgepass.cgg.gov.in లో ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుల సందేహాలకు అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు అందించారు.





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 4:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లను అందించేందుకు అవసరమైన కుల, ధృవీకరణ పత్రాల నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఈఓ విజయ కుమారి, ఎల్డిఎం శివ ప్రసాద్ లతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ నమోదు కోసం ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధృవీకరణలు వెంటనే జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.. ఈ ప్రక్రియలో నమోదు నుండి జారీ వరకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అదే విధంగా సంబంధిత తహసీల్దార్లతో సంప్రదించి ధృవపత్రాల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని తెలిపారు.. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్, పోస్టల్ అకౌంట్ తెరిపించడంలో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.. ముందుగా జాప్యం లేకుండా స్థానిక విద్యార్థుల కుల, ఆదాయ ధృవీకరణలు పెండింగ్‌లో లేకుండా చూడాలని అదేశించారు. పోస్టాఫీస్‌లో 10 సంవత్సరాలు నిండిన విద్యార్థుల పేరు మీద వంద రూపాలయలతో అకౌంట్ ఓపెన్ చేసి స్కాలర్ షిప్ కొరకు అకౌంట్ వివరాలు అనుసంధానం చేయాలని, ఈ అకౌంట్ తెరవడానికి ఆధార్, పోన్ నంబరు ఉంటే చాలని వివరించారు.

## జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మీడియా అకాడమీ.. రూ. లక్ష ఆర్థిక సహాయం



- మరణించిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక సహాయం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- 10 మంది ప్రముఖ జర్నలిస్టులపై మీడియా అకాడమీ మోనోగ్రాఫ్‌ల ఆవిష్కరణ
- సోషల్ మీడియాపై జర్నలిస్టులు ఏకం కావాలని సూచించిన కేశవరావు
- జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న తెలంగాణ ప్రభుత్వం

- మిగతా 4లో...


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి




పి.చిన్నారెడ్డి ఎస్ఈ, కూకట్‌పల్లి జీహెచ్ఎంసి జోనల్ కార్యాలయం..

లంచం నగదును తీసుకున్న పి.చిన్నారెడ్డి, ఔట్ సోర్సింగ్ వ్యక్తి..

అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన ట్రాప్‌లో భాగంగా లంచం స్వీకరిస్తున్న సమయంలోనే ఎస్ఈని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సుదీర్ఘంగా తనిఖీలు నిర్వహిస్తూ సంబంధిత పత్రాలు, ఫైళ్లను పరిశీలించారు. నిందితుడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకుని, లంచం డిమాండ్‌కు సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు.. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ప్రజా సేవకులుగా వ్యవహరించాల్సిన అధికారులు లంచాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, లంచం డిమాండ్‌లో ఇతరుల పాత్ర ఉందా అనే అంశంపై కూడా దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి..



లంచం తీసుకున్న రూ.15 లక్షలు నగదు..

## రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ..!

# 'ఏసీబీ'కి పట్టుబడిన 'ఎస్ఈ'..!

### పెండింగ్ బిల్లుల కోసం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి.. కూకట్‌పల్లి జీహెచ్ఎంసిలో అవినీతి..

- కూకట్‌పల్లి జీహెచ్ఎంసి జోన్‌లో..! ఏసిబికి చిక్కిన ఎస్ఈ చిన్నారెడ్డి..!
- పూర్తయిన పనుల బిల్లుల ఆమోదానికి రూ.15 లక్షలు లంచం డిమాండ్..
- అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా లంచం వసూలు ప్రయత్నం..
- రూ.1.40 కోట్ల బిల్లులు జోనల్ కమిషనర్‌కు పంపాల్సిన అధికారిక ప్రక్రియ పెండింగ్..
- కూకట్‌పల్లి జోన్‌లో అవినీతి బట్టబయలు..

**కూకట్‌పల్లి జీహెచ్ఎంసి జోన్‌లో అధికారిక పనికి లంచం అడిగిన సూపరింటెండింగ్ ఇంజనీర్ పొద్దుటూరి చిన్నారెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) వలలో చిక్కారు.. రూ.1.40 కోట్ల విలువైన బిల్లులు ఆమోదానికి పంపేందుకు రూ.15 లక్షలు డిమాండ్ చేసి, స్వీకరిస్తుండగా ఏసీబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి పోయాడు.. కూకట్‌పల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 4:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసి) పరిధిలో అవినీతి మరోసారి బట్టబయలైంది. కూకట్‌పల్లి జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) పొద్దుటూరి చిన్నారెడ్డి, ఒక కాంట్రాక్టర్ పూర్తి చేసిన పనులను తనిఖీ చేసి, సుమారు రూ.1.40 కోట్లు విలువైన బిల్లులను జోనల్ కమిషనర్ ఆమోదం కోసం పంపించాల్సి ఉండగా..! ఆ అధికారిక సహాయానికి కూడా లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.. దీంతో ఫిర్యాదుదారుడి నుంచి రూ.15 లక్షల లంచం తీసుకునేందుకు తన కార్యాలయంలోనే అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ బాలసాని ప్రవీణ్ కుమార్‌ను మధ్యవర్తిగా ఉపయోగించినట్లు ఏసీబి అధికారులు గుర్తించారు.. లంచం స్వీకరిస్తున్న సమయంలోనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక దాడి చేసి, ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.. ఈ ఘటన జీహెచ్ఎంసిలో అవినీతి ఏ మేరకు పాతుకుపోయిందో మరోసారి స్పష్టంచేస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అధికారికంగా చేయాల్సిన పనికి కూడా లంచం అడగడం గమనార్హం.. ప్రజలకు ఏసీబి అధికారులు విజ్ఞప్తి చేశారు.. ఏ ప్రభుత్వ సేవకుడు అయినా లంచం అడిగినట్లయితే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, వెంటనే తెలంగాణ అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

టోల్ ఫ్రీ నెంబర్: 1064, వాట్సాప్ నెంబర్: 9440446106,
ఫేస్‌బుక్: Telangana ACB
ఎక్స్ (ట్విట్టర్): @TelanganaACB
వెబ్‌సైట్: acb.telangana.gov.in కి పంపించాలని అన్నారు.. ఫిర్యాదుదారులు, బాధితుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏసీబి స్పష్టం చేసింది..






హత్యకు గురైన మృతురాలు సుశీలమ్మ (85) ఫైల్‌ఫోటో..

## వృద్ధురాలి హత్య కేసులో..! పని'మనిషే' హంతకురాలు..

పత్రికా సమావేశంలో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి..

వృద్ధురాలి ఇంట్లో నమ్మకంగా ఉంటూనే..! పని మనిషి ప్రాణాలు తీసిందని వెల్లడి..!

- దుండిగల్ పియస్ పరిధిలో సంచలనం, 24 గంటల్లో హత్య కేసు ఛేదించిన పోలీసులు..
- చర్చ్ గాగిల్లాపూర్‌కు చెందిన చిన్నబట్టిని సుశీలమ్మ (85) ఫిబ్రవరి 2న హత్య..
- 85 ఏళ్ల సుశీలమ్మను ఇంట్లోనే ఒంటరిగా ఉన్న సమయంలో దాడిచేసి హత్య..
- 15 రోజులుగా పని చేస్తున్న మహిళే నిందితురాలుగా గుర్తింపు..
- రాయితో తలపై మోది హత్య, ఒంటిపై బంగారం అపహరణ..
- జ్యువెలరీ షాప్, పరిసరాల సీసీటీవీతో నిందితురాలి గుర్తింపు..
- 24 గంటల్లో అరెస్ట్, బంగారు కమ్మలు, ఉంగరం స్వాధీనం..



దుండిగల్ పియస్‌లో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ప్రెస్‌మీట్..

దుండిగల్ పియస్ పరిధిలో చోటుచేసుకున్న వృద్ధురాలి హత్య కేసులో సంచలన నిజాలు బయటపడ్డాయి. ఇంట్లో పని చేస్తూ నమ్మకం కలిగిన పనిమనిషి మహిళే ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై రాయితో తలపై బలంగా మోది హత్య చేసి, బంగారం ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసును దుండిగల్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించడంపై మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి పోలీసులను అభినందించారు..

దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 4

-4 లో





వృద్దురాలిని హతమార్చిన నిందితురాలు కవిత..

# వృద్ధురాలి హత్య కేసులో..! పని 'మనిషే' హంతకురాలు


హత్యకు గురైన మృతురాలు సుశీలమ్మ (85) ఫైల్‌ఫోటో..

## పత్రికా సమావేశంలో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి..

## వృద్దురాలి ఇంట్లో నమ్మకంగా ఉంటూనే..! పని మనిషి ప్రాణాలు తీసిందని వెల్లడి..!

- దుండిగల్ పియస్ పరిధిలో సంచలనం, 24 గంటల్లో హత్య కేసు ఛేదించిన పోలీసులు..
- చర్చ్ గాగిల్లాపూర్‌కు చెందిన చిన్నబట్టిని సుశీలమ్మ (85) ఫిబ్రవరి 2న హత్య..
- 85 ఏళ్ల సుశీలమ్మను ఇంట్లోనే ఒంటరిగా ఉన్న సమయంలో దాడిచేసి హత్య..
- 15 రోజులుగా పని చేస్తున్న మహిళే నిందితురాలుగా గుర్తింపు..
- రాయితో తలపై మోది హత్య, ఒంటిపై బంగారం అపహరణ..
- జ్యువెలరీ షాప్, పరిసరాల సీసీటీవీతో నిందితురాలి గుర్తింపు..
- 24 గంటల్లో అరెస్ట్, బంగారు కమ్మలు, ఉంగరం స్వాధీనం..

దుండిగల్ పియస్‌లో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ప్రెస్‌మీట్..



దుండిగల్ పియస్ పరిధిలో చోటుచేసుకున్న వృద్ధురాలి హత్య కేసులో సంచలన నిజాలు బయటపడ్డాయి. ఇంట్లో పని చేస్తూ నమ్మకం కలిగిన పనిమనిషి మహిళే ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై రాయితో తలపై బలంగా మోది హత్య చేసి, బంగారం ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తేల్చారు. ఈ కేసును దుండిగల్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించడంపై మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి పోలీసులను అభినందించారు..

దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 4:

**ఆమె నమ్మకమే హత్యకు దారితీసింది..**

వృద్ధురాలి ఇంట్లో పని మనిషిగా చేరిన మహిళే, ఇంటిగుట్టు తెలుసుకుని, ప్రాణాలు తీసిందని మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి పత్రికా సమావేశంలో తెలిపారు.. వృద్ధురాలి ప్రాణాలు తీసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధి చర్చి గాగిల్లాపూర్‌లో చోటుచేసుకుంది.. 85 ఏళ్ల వృద్ధురాలి హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితురాలు కవితను అరెస్ట్ చేశారు.. మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చర్చ్ గాగిల్లాపూర్‌కు చెందిన చిన్నబట్టిని సుశీలమ్మ (85) ఇంట్లో సుమారు 15 రోజులుగా పని చేస్తున్న పి.కవిత (36) తాటి కల్లును సరఫరా చేస్తూ మృతురాలి వద్ద విశ్వాసాన్ని పొందింది.. ఫిబ్రవరి 2, 2026 మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై రాయితో తలపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.. హత్య అనంతరం మృతురాలి చెవులకు ఉన్న బంగారు కమ్మలు, చేతికి ఉన్న ఉంగరాన్ని అపహరించి స్థానిక జ్యువెలరీ షాప్‌లో అమ్మినట్లు దర్యాప్తులో తేలింది..

వృద్ధ మహిళ హత్యకేసులో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి ప్రజలకు కీలక పిలుపు నిచ్చారు.. అపరిచితులకు, ఇంట్లో అద్దెకు ఉండేవారికి, మని మనుషులకు, ఎవరికైనా, ఇంటి యజమాని తమకు సంబంధించిన గుట్టును, చెప్పకుండా ఉండాలని, అపరిచితులు నమ్మకంగా ఉంటూనే ఇలాంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, ఏసిపి శంకర్‌రెడ్డి హెచ్చరించారు

## సీసీపుటేజ్ ఆధారంగా నిందితురాలి అరెస్ట్..

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్దురాలి హత్యకేసు ఘటనలో సీసీకెమెరాలు నిందితురాలిని పట్టించాయని పోలీసులు తెలిపారు.. సంఘటన స్థలం, జ్యువెలరీ షాప్‌లలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితురాలిని గుర్తించారు.. చర్చ్ గాగిల్లాపూర్‌కు చెందిన స్థానికుడు శ్రీకర్ రెడ్డి ఏర్పాటు చేసిన నెబ్యులేషన్ సీసీటీవీ కెమెరాలు ఈ కేసు ఛేదనలో కీలక ఆధారంగా నిలిచాయని ఏసిపి శంకర్‌రెడ్డి తెలిపారు.. ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి నిందితురాలిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు..

ఈ కేసులో ఒక జత బంగారు కమ్మలు, బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ పి.సతీష్, డీఐ బాలరెడ్డి, సీఐ పి.దళి నాయుడు, సీసీఎస్, కూత్బుల్లాపూర్ ఎస్‌వోటీ బృందాల సమన్వయంతో కేసు ఛేదించారని ఏసిపి శంకర్‌రెడ్డి తెలిపారు.. కేసును ఛేదించిన పోలీసులను ఆయన అభినందించారు, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన రివార్డు ఇచ్చే విధంగా చూస్తామని, మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి తెలిపారు..


గాగిల్లాపూర్‌లో పోలీసుల సూచన మేరకు సీసీకెమెరాలు ఏర్పాటు చేసిన శ్రీకర్ రెడ్డిని సన్మానిస్తున్న పోలీసులు..

## నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి: ఏసిపి శంకర్‌రెడ్డి..

నేర రహిత సమాజం కోసం, నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి తెలిపారు.. నివాస ప్రాంతంలో, వ్యాపార సంస్థల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. గాగిల్లాపూర్‌లో గతంలో జరిగిన ఓ హత్యకేసుకు సంబంధించి, విచారణలో భాగంగా తలెత్తిన సమస్యతో, ఏసిపి శంకర్‌రెడ్డి పిలుపు మేరకు స్థానికంగా నివసించే శ్రీకర్ రెడ్డి స్పందించి, ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఈ వృద్దురాలి హత్యకేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించడానికి ఎంతో దోహదపడిందని ఏసిపి శంకర్‌రెడ్డి ప్రశంసించారు.. దుండిగల్ పోలీస్ స్టేషన్‌లోనే ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లోనే శ్రీకర్ రెడ్డిని మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి శాలువాతో సత్కరించి, అభినందించారు.. ప్రతి ఒక్కరు కూడా శ్రీకర్ రెడ్డి వలె సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని, నేర రహిత సమాజం కోసం పోలీసులకు సహకరించాలని ఏసిపి పిలుపు నిచ్చారు..

## జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మీడియా అకాడమీ.. రూ. లక్ష ఆర్థిక సహాయం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మీడియా అకాడమీ, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలిచింది. వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలతో కూడిన చిరు పుస్తకాలను ఆవిష్కరించింది. బుధవారం నాడు హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, అక్షరాన్నే ఆయుధంగా చేసుకుని క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులు అకాల మరణం చెందడం బాధాకరమని అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్‌ను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు, ఐదేళ్లపాటు పెన్షన్ అందిస్తుండటం బాధిత కుటుంబాలకు గొప్ప ఊరట అని పేర్కొన్నారు. ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలతో కూడిన చిరు పుస్తకాల (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఎన్ని ఎలక్ట్రానిక్ మీడియా సాధనాలు వచ్చినా, తాను మాత్రం ఇప్పటికీ పత్రిక చదివితేనే సంతృప్తి చెందుతానని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు మాట్లాడుతూ, ప్రముఖుల జీవిత చరిత్రను మోనోగ్రాఫ్‌గా తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. సమాజానికి వార్త అద్దం పడితే, దాని వెనకున్న నిజాన్ని నిగ్గు తేల్చిన జర్నలిస్టు భవిష్యత్ తరాలకు మార్గదర్శి అవుతారని అన్నారు. సోషల్ మీడియాను నియంత్రించడం ఎవరి తరం కాదని, దానిపై జర్నలిస్టులందరూ ఏకతాటిపైకి వచ్చి వర్క్‌షాప్‌లు నిర్వహించడం ద్వారా కొంత మార్పునకు నాంది పలకాలని సూచించారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మరణించిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు తలా లక్ష రూపాయల చొప్పున, ప్రమాదానికి గురైన మరో జర్నలిస్టుకు రూ. 50,000 ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందించినట్లు తెలిపారు. అలాగే, ప్రముఖ పాత్రికేయులు అబిద్ అలీఖాన్, డి. సీతారాం, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎ.బి.కె. ప్రసాద్, సి. రాఘవాచారి సహా 10 మంది దిగ్గజాలపై మీడియా అకాడమీ ప్రచురించిన మోనోగ్రాఫ్‌లను ఆవిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హైడ్రా..

### ప్రతి శనివారం ఫోన్-ఇన్ ద్వారా ఫిర్యాదులకు అవకాశం

-3 పేజి తరువాయి

(ఫిబ్రవరి 07) ఫోన్-ఇన్ కార్యక్రమం ప్రారంభ అవుతున్నట్లు తెలిపారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని నగర ప్రజలకు అవకాశం కల్పించనున్నారు. ఫిర్యాదుల కోసం ఫోన్ నంబర్లు: 040-29565750, 040-29565759 అందుబాటులోకి తెచ్చారు. చెరువులు, పార్కులు, రహదారులు, ప్రజావసర స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదు చేసుకునే వీలు కల్పిస్తున్నారు. చెరువుల్లో మట్టి పోయడం వంటి అక్రమాలపై కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోతే వాటి స్థితిగతులపై తెలుసుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం లక్ష్యంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# వేములవాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

## -కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ

**హైదరాబాద్ పెన్ పవర్:** వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పట్టణ ప్రజలు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ విజ్ఞప్తి చేశారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు నిధులు వెచ్చించి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వేములవాడ పట్టణానికి భక్తుల తాకిడి పెరిగి పట్టణవాసులకు ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం, రేషన్ కార్డు లేని వానికి రేషన్ కార్డులు మంజూరు చేశారని, సన్న వడ్లకు 500 బోనస్, రైతు భరోసా ను న్యాయంగా రావలసిన వారికి వర్తింపజేయడం, దాదాపు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తూ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువచ్చింది అన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలంటే మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గోటికార్ కిషన్ జీ కోరారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244

## లాయర్ స్వప్న హత్య కేసు.. ఇద్దరు అరెస్ట్

**వికారాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ శివారులో న్యాయవాది స్వప్న దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. పొలం వద్ద దుండగులు ఆమె మెడపై నరికి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాగా ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. మొయినాబాద్ పోలీసులు స్వప్న అన్న రాజు, డ్రైవర్ వీరేశంను అదుపులోకి తీసుకున్నారు. స్వప్న అన్నే హత్య చేయించాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## వుడ్ స్క్రాప్‌కు మంటలు.. తప్పిన పెను ప్రమాదం

**నాంపల్లి, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** బుధవారం హైదరాబాద్‌లోని ఒస్మాన్పురాలో ఒక నివాస గృహ ప్రాంగణంలో నిల్వ ఉంచిన పాత చెక్క సామాగ్రిలో అగ్నిప్రమాదం సంభవించింది. చదర్ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సమీప నివాసాలకు మంటలు వ్యాపించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించకపోవడం ఊరటనిచ్చింది. సకాలంలో స్పందించిన అగ్నిమాపక శాఖ చర్యల వల్ల భారీ ఆస్తి నష్టం, ప్రాణాపాయం తప్పింది.

## మనసురాబాద్‌లో హ్యాండిల్ ఎక్స్‌రే యంత్రం ప్రారంభం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్, మనసురాబాద్‌లో డీఎం & హెచ్‌ఓ డాక్టర్ లలిత దేవి చేతుల మీదుగా హ్యాండిల్ ఎక్స్‌రే యంత్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ నూతన యంత్రం ద్వారా రోగులు ఉన్న చోటుకే వెళ్లి ఎక్స్‌రే తీసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీనివల్ల ప్రజలకు తక్కువ ఖర్చుతో, సులభంగా వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎం & హెచ్‌ఓ డాక్టర్ లలిత దేవి, ఏడీఎం & హెచ్‌ఓ డాక్టర్ పాపారావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ ఆయేషా, డాక్టర్ అనిసా, డీపీఎస్ శ్రీనివాసులు, డీపీపీఎం విల్సన్ విజయకుమార్, అనురాధ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాటేదాన్ డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

**చార్మినార్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ డివిజన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బుధవారం పర్యటించి, శ్రీరామ్ నగర్, వెంకటేశ్వర నగర్, నేతాజీ నగర్ బస్తీల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ మరమ్మతులు, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు క్రమబద్ధ నీటి సరఫరాపై అధికారులను ఆదేశించారు. పాడైన అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** వ్యక్తిని కిడ్నాప్ చేయడంతో పాటు బెదిరించి డబ్బులు వసూలు చేసిన ముగ్గురు నిందితులను గాంధీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన ఉగ్గి వీరేష్, గద్దల క్రాంతికుమార్, ఉడి శ్యామ్‌సుందర్ పథకం ప్రకారం గాంధీనగర్‌కు చెందిన కౌశిక్‌కుమార్‌ను ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా రుబెగేమ్‌లో రూ.3 లక్షలు గెలుచుకున్నావని, నగదు తీసుకునేందుకు రావాలని గత నెల 31న కవాడిగూడలోని సీజీవో టవర్స్ వద్దకు పిలిచారు. కౌశిక్‌కుమార్ అక్కడకు వెళ్లగానే అతనిని కారులో అపహరించి జనగాం ప్రాంతానికి తీసుకెళ్లి చంపేస్తామని బెదిరించి రూ.కోటి చెల్లించాలని డిమాండ్ చేశారు. చివరికి తమ బ్యాంకు ఖాతాకు రూ.4 లక్షలు బదిలీ చేయించుకుని మరుసటి రోజు ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి వద్ద బాధితుడిని వదిలిపెట్టారు.

## వాహన రిజిస్ట్రేషన్ బదిలీ చేయకుంటే వేతలు

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్‌లో 2025 డిసెంబరు 20నాటికి అధికారిక లెక్కల ప్రకారం అన్ని రకాల వాహనాల సంఖ్య మొత్తం 94లక్షలు. గుర్తుతెలియని, అనధికార వాహనాలు మరో 10 లక్షల వరకు ఉంటాయని అధికారులు చెబుతున్నమాట. నగరంలోవాహనాలు చేతులు మారుతున్నా.. తమ పేరుమీదకు బదిలీ చేసుకోవడంలో వాహనదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాహనాలు నిర్దిష్ట కాలపరిమితి దాటిన తర్వాత వాటిపునరుద్ధరణ, గడువు పొడిగించుకోవాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని అని భావిస్తున్నారు. దీంతో తక్కువ ధరకే ఆయా వాహనాలను విక్రయిస్తున్నారు. కొనుగోలు చేసేవారు వాటిని ఎలాంటి తనిఖీ చేయకుండా.. కనీస ధ్రువపత్రాలు కూడా లేకుండా అలాగే తీసుకుంటున్నారు.

## రైలులో గుండెపోటుతో వివాహిత మృతి

**ముషీరాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** భర్తతో కలిసి సొంతూరుకు వెళ్లేందుకు రైలు ఎక్కిన ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల గుల్లకోటకు చెందిన లక్ష్మణ్, రమాదేవి(43) దంపతులు అల్వాల్ క్రాస్‌రోడ్డు లోని ఓ హాస్టల్‌లో వంట పనిచేస్తుంటారు. వీరు మంచిర్యాల వెళ్లేందుకు సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. బోగీలో రమాదేవికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారు.

# డైవర్షన్ పాలిటిక్స్ కంటిన్యూ...

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** తెలంగాణలో 12 ఏళ్లుగా డైవర్షన్ పాలిటిక్స్ కొనసాగుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్.. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటినాలుగున్నరేళ్లు టీడీపీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకున్న కేసీఆర్ ప్రతిపక్షం లేకుండా చేయాలనుకున్నారు. ఇక 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లి డైవర్షన్ పాలిటిక్స్‌కు కొత్త అర్థం చెప్పారు.ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లి.. మరోమారు అధికారంలోకి వచ్చారు. తమ ప్రభుత్వం విమర్శలు లేదా ఆరోపణలు పెరిగినప్పుడు కేంద్ర బీజేపీపై దాడి చేయడం, బండి సంజయ్ వంటినాయకులపై ప్రెస్‌మీట్లు నిర్వహించడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేసేవారు. ఇది క్లాసిక్ డైవర్షన్ టాక్టిక్‌గా మారింది. సొంత సమస్యల నుంచి దూరం చేయడానికి విమర్శకులపై ప్రతిదాడిచేసేవారు.ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రాజ్ నడుస్తోంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు రేవంత్ కూడా కేసీఆర్‌ను మించిన డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదనిపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తన వ్యూహాన్ని మరింత పార్పొగా అమలు చేస్తున్నారు.మూసీ శుద్ధీకరణ ప్రాజెక్ట్‌పై హైడ్రా ప్రజల్లో రేవంత్ సర్కార్‌పైవ్యతిరేకత వచ్చింది. మూసీ ఆక్రమణల కూల్చివేతతో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. దీనిని ప్రతిపక్ష బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మలచుకోవాలని భావించింది. దీంతో రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్‌కుతెరలేపారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫార్ములా ఈ రేసు కేసులో నోటీసులు జారీ చేశారు. హైడ్రా కూల్చివేతలపై మొదట్లో హైదరాబాద్ వాసుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ తర్వాత పెద్దల ఇళ్లు కూల్చకుండా పేదలవి కూల్చడంపై వ్యతిరేకత వచ్చింది. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు రేవంత్‌రెడ్డి ఫీచర్ సిటీని తెరపైకి తెచ్చారు. హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఈవేరకుభూముల్లోని చెట్లను బుల్డోజర్లతో తొలగించడం రాష్ట్రవ్యాప్తంగా రచ్చకు తెరలేపింది. అడవిని తొలగిస్తున్నారని, వన్యప్రాణులను చంపేస్తున్నారని మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. పర్యావరణ ప్రేమికులు కోర్టును ఆశ్రయించారు. దీంతో యథాతథ స్థితి కొనసాగిందాలని న్యాయస్థానాలు స్టే విధించాయి. దీనిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఈ సమయంలోనూ రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టిమళ్లించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ అంశాన్ని తెరపైకి తెచ్చారు. తాజాగా, నైనా బొగ్గు టెండర్‌లో భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మధ్య ఆధిపత్య పోరుబయటపడింది. టెండర్ కోసం ఇద్దరు మంత్రులు పోటీ పడటం, భట్టికి చెందిన సంస్థకు అప్పగించే ప్రయత్నాలు జరగడం సంచలనమైంది. ఇదే సమయంలో కోమటిరెడ్డికి, ఓ ఐఏఎస్‌కు లింకు అంటగట్టడం, ఐఏఎస్‌లుఅంతా ఒక్కటై కేసు పెట్టడం రేవంత్ సర్కార్‌కు మచ్చగా మారింది. దీంతో రేవంత్‌రెడ్డి మరోమారు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చి మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్, సంతోష్‌రావులకు నోటీసులు ఇచ్చారు. విచారణ చేయించారు.మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన ఈ సమయంలో, కాంగ్రెస్ మెజారిటీ మున్సిపాలిటీలను కౌవసం చేసుకుని బలంగా కనిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి భాగంగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ డ్రామాను సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వ వ్యతిరేకతనుఅణచివేయాలని భావిస్తున్నారు.ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. లోపాలు బయట పడిన సమయంలో విపక్ష నాయకులపై కేసులు పెట్టడం వల్ల ప్రజలు ప్రభుత్వ విఫలాలను మరచిపోతారు. ఇది కేవలం రాజకీయ డైవర్షన్ కాదు, విచారణల ద్వారా ఎదురుదలను కూడా సృష్టిస్తుంది.ఈ వ్యూహం కొంతమేర పని చేసినా, ప్రజలు దీర్ఘకాలిక సమస్యలు (మూసీ,టెండర్లు) మరచిపోలేరు లేదు. కేసీఆర్ తన హయాంలో చేసినట్లే రేవంత్ కూడా ఇదే మార్గం తీసుకుంటుంటే, ఎన్నికల్లో కాంగ్రెస్ బలం నిజమేనా అనేది పరిక్షించాలి. డైవర్షన్ పాలిటిక్స్ రాజకీయాల్లో సాధారణం కాబట్టి,దీర్ఘకాలంలో పాలసీలు, అభివృద్ధి చూపితేనే నిజమైన విజయం వస్తుంది.

# ఐటీ కారిడార్ లో స్కైవాక్...

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఐటీ కారిడార్‌లో సరికొత్త స్కైవాక్ నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. రాయదుర్గ్-టీహబ్ మార్గంలో ఈ కొత్త స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్కైవాక్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదిత మార్గంలో.. ఉన్నతాధికారులతో కలిసి సైబరాబాద్ సీపీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లు దాటేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ మార్గంలో స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రెడీ చేశారు.ఐటీ హబ్‌గా దూసుకెళు న్న హైదరాబాద్‌లో రోజురోజుకూ జనాభా భారీగా పెరిగిపోతోంది. ఐటీ కారిడార్‌లో నిత్యం లక్షల మంది టెకీలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఆ మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ప్రభుత్వం.. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ పనులను ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉంది. అయినప్పటికీ జనం, వాహనాల రద్దీతో.. నగరంలో జనం ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ సమయంలో పాదచారులు నడిచేందుకు, రోడ్డు దాటేందుకు కూడా చాలా కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం రద్దీగా ఉండే కీలక ప్రాంతాల్లో స్కైవాక్‌లను ఏర్పాటు చేస్తోంది. విశాలమైన రోడ్లు దాటలేక ఇబ్బంది పడేవారికి.. ట్రాఫిక్ ఉన్న సమయంలో.. పాదచారులు ఈ స్కైవాక్‌లను ఉపయోగించి.. సులువుగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ఇప్పటికే నగరంలోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్కైవాక్‌లపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైబరాబాద్‌లోని రాయదుర్గ్-టీ హబ్ వద్ద కొత్త స్కైవాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. హైదరాబాద్‌లోని రద్దీగా ఉండే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు, పాదచారుల భద్రత, మరింత సౌకర్యంగా నడిచి వెళ్లడం కోసం ఈ స్కైవాక్‌ను నిర్మించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం రమేష్.. క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ స్కైవాక్.. రాయదుర్గ్ నుంచి ప్రారంభమై మెట్రో స్టేషన్, ఐకియా ఫ్లైఓవర్, ఐటీసీఎల్ జంక్షన్ మీదుగా టీ-హబ్ వరకు నిర్మించనున్నారు.

మెట్రో ప్రయాణికులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, నగరవాసులతో కిక్కిరిసిపోయి ఉండే ట్రాఫిక్, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. ఈ స్కైవాక్ ప్రాజెక్టును అధికారులు ప్రతిపాదించారు.ఈ స్కైవాక్ నిర్మాణంతో దాదాపు 30 శాతం ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని అధికారులు ప్రణాళికలు వేశారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహాయంతో ఈ స్కైవాక్ ప్రతిపాదనను అధికారులు రూపొందించారు. ఈ స్కైవాక్ ఫేజ్-1లో భాగంగా 500 మీటర్ల మేర నిర్మించనున్నారు. ఇక టీ-హబ్, మైండ్ స్పేస్ సీ-గేట్‌ను కలుపుతూ 400 మీటర్ల అండర్‌పాస్ నిర్మించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## కొత్తగూడెంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం



**కొత్తగూడెం: పెన్ పవర్:** కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ గా అవతరించిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారని,అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని, ఇంతకుముందు కూడా ఈ మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ తమ పార్టీకి చెందినవారేనని చెప్పారు.ఎంపీ రవిచంద్ర బుధవారం తనను కలిసిన ఒక టీవీ ఛానెల్ ప్రతినిధితో మాట్లాడుతూ, ధర్మం-అధర్మానికి జరుగుతున్న పోరులో బీఆర్ఎస్ అంతిమంగా ధర్మమే గెలుస్తుందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చనందున బడుగు బలహీన వర్గాల వారంతా కాంగ్రెస్ పాలకులపై మండిపడుతున్నారన్నారు.వృద్ధులు,దివ్యాంగుల పింఛన్లు పెంచలేదని,రైతుబంధు సక్రమంగా ఇవ్వట్లేదని, నిరుద్యోగ యువతకు,కౌలు రైతులకు చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కారని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.మాజీ మంత్రి హరీష్ రావు బొగ్గు కుంభకోణాన్ని వెలికి తీయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలకు దిగి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు,ఆయన కుటుంబ సభ్యులకు వరుసగా నోటీసులిచ్చి "డైవర్షన్ పాలిటిక్స్"చేస్తున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ సర్కార్ పనితీరును చూసి తాము నష్టపోయామేమోనని ప్రజలు బాగా అర్థం చేసుకోవడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.కొత్తగూడెంతో పాటు ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతున్నదని,అన్ని చోట్ల కూడా గులాబీ జెండా రెపరెపలాడడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

## నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

**జగిత్యాల: పెన్ పవర్:** నేను బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన.. ఇప్పుడు కూడా నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నా. అంతే. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు.. రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని అన్నారు. నేను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నా.. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని అన్నారు.

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారిన ఫిర్యాదును డిస్మిస్ చేసిన స్పీకర్ నిర్ణయం పై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు.తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయ బద్ధంగా ప్రవర్తించడం లేదని అన్నారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా.. స్పీకర్ కి కనపడకపోవడం విచారకరం, చర్య తీసుకోకపోవడం దురదృష్టకరం. స్పీకర్ ఏకపక్ష నిర్ణయం ప్రజలు గమనిస్తున్నారు. కాంగ్రెస్ చర్యల పట్ల ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనబడటం లేదా అని ప్రశ్నించారు.ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరవుతున్నారు.. అది స్పీకర్ కి కనపడలేదు అంటా . స్పీకర్ ఆత్మసాక్షిగా, చట్ట పరంగా నిర్ణయం తీసుకోలేక పోతున్నారు.

# వికారాబాద్ లో వేడెక్కిన రాజకీయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** పురపాలిక ఎన్నికలు సమీపించిన వేళ వికారాబాద్ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకే కాకుండా స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారుల పాత్ర మరింత కీలకంగా మారిందని తెలుస్తోంది. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో మొత్తం వందకు పైగా వార్డులు ఉండగా, వాటిలో 30 నుంచి 40 వార్డుల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. నేరుగా బరిలోకి దిగడం, లేదా అనుచరులను రంగంలోకి దించడం ద్వారా ఎన్నికల ఫలితాలను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.ఎన్నికల్లో నేరుగా పోటీ చేసి గెలవకపోయినా, రిజర్వేషన్‌విధానం ప్రకారం ఛైర్మన్ పదవులు దక్కించుకోవచ్చన్న లెక్కలతో చాలామంది వ్యాపారులు ముందడుగు వేస్తున్నారు. వార్డుల ఫలితాల ఆధారంగా బలమైన కౌన్సిలర్ల మద్దతు సాధిస్తే, తర్వాత ఛైర్మన్ ఎన్నికలో కీలకపాత్ర పోషించవచ్చన్నది వారి వ్యూహం. అందుకే ఇప్పటి నుంచే అన్ని విధాలా సిద్ధమవుతూ రాజకీయ సమీకరణాలను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.: తాండూరులో ఒక ప్రముఖ స్థిరాస్తి వ్యాపారిఎన్నికల గోదాలోకి దిగకముందే తన వ్యూహాన్ని అమలు చేశారు. పోటీ చేయనున్న వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి, స్థానిక సమస్యలపై చర్చించారు. ఓటు బ్యాంకు ఉన్న నాయకులను గుర్తించి వారికితాయిలాలు ముట్టజెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఇదే పట్టణంలో ప్రధాన పార్టీ అభ్యర్థికి దీటుగా మరో పార్టీ నుంచి స్థిరాస్తి వ్యాపారి బరిలోకి దిగుతున్నారని సమాచారం. దీంతో తాండూరులో పోటీ మరింతఉత్కంఠభరితంగా మారింది. వికారాబాద్ పట్టణంలో కొన్ని వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులను స్థిరాస్తి వ్యాపారులు భరిస్తున్నారన్న ప్రచారం జోరుగా వినిపిస్తోంది. ప్రచారం, సభలు, వాహనాలు, కార్యకర్తల నిర్వహణ వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతుండటంతో అభ్యర్థులు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. దీని ద్వారా వ్యాపారులు భవిష్యత్తులో పురపాలిక నిర్ణయాల్లో తమ మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకోవాలనిభావిస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్, పరిగి పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులు స్వయంగా పోటీ చేస్తుండగా, మరికొన్నిచోట్ల అనుచరులను బరిలోకి దింపుతున్నారు. స్థానిక రాజకీయనాయకులతో పొత్తులు పెట్టుకుని, గెలుపు కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు పురపాలిక రాజకీయాలపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతోందో సూచిస్తున్నాయి.వికారాబాద్ జిల్లాపురపాలికలకు హైదరాబాద్‌తో ఉన్న అనుసంధానం స్థిరాస్తి వ్యాపారుల రాజకీయ ఆసక్తికి ప్రధాన కారణంగా మారింది. హైదరాబాద్ నుంచి 78 నుంచి 119 కిలోమీటర్ల దూరంలోనే ఈ పట్టణాలు ఉన్నాయి. రాజధానిపరిసరాల్లో ఎకరం భూమి ధర రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా, ఈ పురపాలికల సమీపంలోని భూములు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు మాత్రమే ఉన్నాయి. ఈ ధరల తేడానే పెట్టుబడిదారులనుఇక్కడికి ఆకర్షిస్తోంది. హైదరాబాద్ వ్యాపారులు స్థానికులతో కలిసి భూములు కొనుగోలు చేసి, వెంచర్లు అభివృద్ధి చేసి భారీ లాభాలు పొందుతున్నారు.కొందరు స్థిరాస్తి వ్యాపారులు నేరుగా ఎన్నికల్లో పోటీ చేయకుండా,వెనకుండి తంతు నడుపుతున్నారు. తమకు నమ్మకమైన అనుచరులను బరిలోకి దింపి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు. అనుచరులు గెలిచిన తర్వాత కీలక సందర్భాల్లో ఛైర్మన్ అభ్యర్థికి మద్దతుఇచ్చి, భవిష్యత్తులో పురపాలిక ద్వారా లాభాలు పొందాలన్నది వారి ఆలోచన. మొత్తంగా చూస్తే, వికారాబాద్ జిల్లా పురపాలిక ఎన్నికల్లో స్థిరాస్తి వ్యాపారుల ప్రభావం ఈసారి మరింత పెరిగింది. రాజకీయాలు, వ్యాపారంఒకదానితో ఒకటి ముడిపడుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, భవిష్యత్తులో పురపాలికల పాలనపై స్థిరాస్తి రంగం ఎంత ప్రభావం చూపుతుందన్నది మాత్రం ఆసక్తికరంగా మారింది.

# బంగారం ధర పెరుగుదలతో వర్సటీలకు కొత్త కష్టాలు..!



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** భారీగా పెరుగుతున్న బంగారం ధరలు తెలంగాణలోని వర్సటీలకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టాయి. ధరలు పెరుగుతుండటంతో విద్యార్థులకు ఇచ్చే బంగారం పథకాల తయారీకి అధిక వ్యయం అవుతోంది. దీంతో డిపాజిట్ మెత్తాన్ని పెంచాలని కోరుతూ వర్సటీ అధికారులు దాతలకు లెటర్లు రాస్తున్నారు. దాంతో పాటుగా గోల్డ్ మెడల్స్ తయారీలో గోల్డ్ వినియోగాన్ని గ్రాము వరకు తగ్గించి ఇతర లోహాలను కలిపి తయారు చేయిస్తున్నారు.బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత వారం క్రితం అయితే రికార్డు స్థాయికి ధర చేరుకుంది. సామాన్యులు బంగారం, వెండి కొనుగోలు చేయాలంటేనే వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టుగా.. బంగారం ధర పెరగటంతో వర్సటీలకు కొత్త కష్టాన్ని తెచ్చిపెట్టింది. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఆకాశమే హద్దుగా అనూహ్యంగా పెరగడంతో వర్సటీల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించే బంగారు పతకాల బరువు క్రమంగా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్సటీలు అప్రమత్తమయ్యాయి.పతకాలను ప్రవేశపెట్టిన దాతలకు డిపాజిట్ నిధి మొత్తాన్ని పెంచాలని లేఖలు రాసేందుకు రెడీ అవుతున్నాయి. మార్చి 7న జేఎన్‌టీయూహెచ్ 14వ స్నాతకోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో డిపాజిట్ పెంచాలని లెటర్స్ రాస్తున్నారు. ఇక గత ఏడాది జూన్‌లో జరిగిన 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు బహుకరించే 20 గ్రాముల పతకంలో వెండి, రాగితోపాటు మూడు గ్రాముల బంగారం వినియోగించారు. ఈసారి బంగారం పరిమాణాన్ని మూడు నుంచి రెండు గ్రాములకు తగ్గించారు. ఆ మేరకు వెండి, రాగిని పెంచినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మొత్తం 71 పతకాలను ప్రతిభావంతులైన విద్యార్థులకు బహూకరించనున్నారు. అందులో కొన్నింటిని వర్సిటీలు సొంత నిధులతో ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని దాతల సహకారంతో సమకూరుస్తున్నారు.గత అక్టోబరులో పాలమూరు వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించారు. అందులో 20 గ్రాముల పతకంలో 0.9 గ్రాముల బంగారం, 17.10 గ్రాముల రాగి, రెండు గ్రాముల వెండి వడినట్లు పాలమూరు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.రమేశ్‌బాబు వెల్లడించారు. ఒక్కో పతకానికి రూ.15 వేల వరకు ఖర్చు అయినట్లు తెలిపారు. ప్రస్తుతం దాతలు పతకాన్ని ప్రవేశపెట్టాలంటే ఆయా వర్సిటీలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ముందస్తు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వాటిని ఎండోమెంట్ మెడల్స్‌గా పిలుస్తారు. డిపాజిట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీతో బంగారు పతకాలు తయారు చేసి స్నాతకోత్సవం సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు అందజేస్తుంటారు.బంగారం ధర ఊహకందని విధంగా భారీగా పెరిగిపోతుండటం.. వచ్చే వడ్డీ సరిపోవటం లేదు. దీంతో కొన్ని వర్సిటీలు మరికొంత మొత్తాన్ని డిపాజిట్ చేయాలని దాతలకు లేఖలు రాస్తున్నాయి. జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా యూనివర్సిటీలో డిపాజిట్ మొత్తం రూ.5 లక్షల వరకు ఉండగా.. పాలమూరు, నల్గొండలోని మహాత్మా గాంధీ వర్సిటీల్లో మాత్రం రూ.2 లక్షలు ఉంది. ఇక నుంచి వర్సటీల్లో కొత్తగా పతకాలు ప్రవేశపెట్టే వారి నుంచి రూ.3 లక్షలు తీసుకోవాలని పాలమూరు, గాంధీ వర్సిటీలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాయి.

# తెలంగాణలో భారీగా టైఫాయిడ్ మరణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది.2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది.మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి.సాల్మోనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మోనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మోనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది.అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు.నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.

# డీఎస్పీ నుంచి సిఐగా డిమోషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓ డీఎస్పీకి డిమోషన్ ఇచ్చింది. అతడికి డీఎస్పీ హోదా రద్దు చేసి ఇన్‌స్పెక్టర్ స్థాయికి తగ్గిస్తూ హోంశాఖ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కేసులో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్ రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. తక్కువ కాలంలోనే రూల్స్‌కు విరుద్ధంగా డీఎస్పీగా పదోన్నతి పొందటంపాటు.. ప్రొబేషన్ కాలంలోనే విధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు గాను సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో గత బీఆర్‌ఎస్‌ప్రభుత్వం ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ పదోన్నతి క్యాన్సిల్ అయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్ హోదాతోనే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో విశేష ప్రతిభకనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే తక్కువ కాలంలో యాక్సిలరేటెడ్ ప్రమోషన్ కల్పించే విధానం తెలంగాణలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో ప్రణీత్ రావు పనిచేయకపోయినా రాజకీయ లబ్ధి కోసండీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లోనే కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఒక్క ప్రణీత్ రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించారు. ఈ ఘటనవివాదానికి దారితీసింది.ప్రణీత్‌రావు సర్వీస్ చూసినట్లయితే.. ఎస్సై హోదాలో 2016 అక్టోబరు 24న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. 2023 డిసెంబరు 13 వరకు అక్కడే పనిచేశారు. ఎస్ఐబీలోఉన్నప్పుడే ఇన్‌స్పెక్టర్‌గా, యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా కూడా ప్రమోషన్ పొందాడు. ఎస్ఐబీలో ఆయన నేతృత్వంలోనే స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ ఏర్పాటైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినమరుసటి రోజు అంటే డిసెంబరు 4న ఎస్ఐబీ భవనంలోని సీసీ కెమెరాలను స్విచ్‌ఆఫ్ చేసి, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలోని హార్డ్‌డిస్క్‌లు, అందులోని డేటాను ధ్వంసం చేశారు.ఈ వ్యవహారంలో ప్రణీత్‌రావు కీలకపాత్రపోషించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. దీంతో అతడ్ని సస్పెండ్ చేయాలని నాటి ఇంటెలిజెన్స్ విభాగం అదనపు డీజీపీ 2024 జనవరి 17న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది మార్చిలోప్రణీత్‌రావును అధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జైలుకు కూడా పంపారు. తాజాగా అతడికి డిమోషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది

## పినపాకలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

**వైరా, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** పినపాక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సమానత్వం, న్యాయం, సోదరభావం యొక్క ప్రాధాన్యతను గుర్తు చేశారు.

## ఇసుక బహిరంగ వేలం

**పినపాక, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** దమ్మపేటలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్ల ఇసుకను గురువారం ఉదయం 11 గంటలకు తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నట్లు తహశీల్దార్ రామ్ నరేష్ బుధవారం తెలిపారు. వేలం దక్కించుకున్న వారు సగం నగదు వెంటనే, మిగిలిన సగం మూడు రోజుల్లోగా చెల్లించాలని, సొంత ఖర్చులతోనే ఇసుకను తరలించుకోవాలని సూచించారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న గుగ్గిళ్ళ దివ్య సృజన్



**ములుగు, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ములుగు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో 5వ వార్డు అభ్యర్థి గుగ్గిళ్ళ దివ్య సృజన్ ప్రజలను తమ బిడ్డలుగా ఆదరించి గెలిపించాలని కోరుతున్నారు. తాను గెలిస్తే 5వ వార్డును అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇస్తున్నారు. కాలనీల్లో తిరుగుతూ తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్ల సమస్యలను ప్రజల నుండి తెలుసుకుంటున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

## పరకాల లో బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్ లో చేరిక

**పరకాల, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, 14వ వార్డు బీజేపీ అభ్యర్థి బొల్లెడ్ల సుష్మ కృపేందర్ బుధవారం బీజేపీ పార్టీకి రాజీనామా చేసి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పరకాల పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు సుష్మ కృపాకర్ తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలి.. కడియం కావ్య

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కనకదుర్గ కాలనీలో మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ ఎన్‌జీవో సంయుక్తంగా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ప్రచార రథాన్నిబుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, బాల్యవివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతాయని, బాల్యవివాహాలు లేని తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉన్నత విద్య కోసం కృషి చేయాలని సూచించారు.

## సంగారెడ్డి జనరల్ హాస్పిటల్ లో క్యాన్సర్ పై అవగాహన



**సంగారెడ్డి, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో బుధవారం నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, రోగులు, సహాయకులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. వయసుతో సంబంధం లేకుండా వచ్చే ఈ మహమ్మారి నివారణకు ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాలు, పొగాకు, ప్లాస్టిక్ లో నిల్వ ఉంచిన పదార్థాలు తినడం వంటివి కారణమవుతాయని నర్సింగ్ కళాశాల విద్యార్థినులు శిల్పా రాణి, రేణుక చార్టుల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మ, సిబ్బంది, ఆరోగ్యశ్రీ సిబ్బంది హిమగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

## న్యాల్కల్ దర్గా ఉర్సు జాతరలో భక్తజన సందోహం

**జహీరాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల కేంద్రంలోని హజ్రత్ పీరైబ్ సాహెబ్ దర్గా వద్ద బుధవారం జరిగిన ఉర్సు జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని పలు గ్రామాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పీరైబ్ సాహెబ్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దువ్వా, నియాజ్, మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా హాజరై జాతర వాతావరణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది. భక్తుల రాకతో దర్గా పరిసరాల్లో సందడి నెలకొంది.

## మాజీ జడ్పీ ఛైర్మన్ సరిత కీలక వ్యాఖ్యలు



**గద్వాల్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో బి–ఫామ్ ఇవ్వడంలో కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని, తాము రాజకీయ వ్యభిచారం చేయడం లేదని జోగులాంబ గద్వాల జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ సరిత బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. గద్వాలలో కాంగ్రెస్ కష్టకాలంలో పార్టీ జెండా మోసిన తనకు, డీసీసీనే మోసం చేసిందని, ఈ విషయంపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానాన్ని కాదని గుంటనక్కలకు సీట్లు పంపిణీ చేశారని ఆరోపించారు. అధిష్టానం తన వైపే ఉందని, ప్రజలకు మరింత దగ్గరై తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ఆమె తెలిపారు.

# పదో తరగతి విద్యార్థులకు 2.2 కోట్ల నగదు బహుమతి



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ 'మిషన్ టెన్త్ క్లాస్' ప్రోగ్రాం ద్వారా తెలంగాణలోని పదో తరగతి విద్యార్థులకు 2.2 కోట్ల రూపాయల నగదు బహుమతిని అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా, గాదిగూడ మండలంలోని కేజీబీ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ బహుమతిలో భాగంగా స్టేట్స్ టాపర్‌కు 5 లక్షలు, రెండో బహుమతిగా 3 లక్షలు, జిల్లా టాపర్‌కు 2 లక్షలు, నియోజకవర్గ టాపర్‌కు లక్ష రూపాయలు, అలాగే 612 మండలాల్లో టాప్ వచ్చిన వారికి పదివేల రూపాయల నగదు బహుమతి అందజేయబడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ "మిషన్ 10బిస్త్ర క్లాస్" ప్రారంభం

**బోథ్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలో, ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ "మిషన్ 10బిష్ట్ర క్లాస్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గడిగుడ మండలం వాఎ పి. ప్రణయ్ కుమార్ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను పెంపొందించడానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సామాజిక పరివర్తనకు విద్య కీలకమని, ఇటువంటి కార్యక్రమాలు అర్హులైన విద్యార్థులకు గణనీయమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం "చదువుకో తెలంగాణ" అనే నినాదంతో ముందుకు సాగుతోంది.

## ఆదిలాబాద్ జిల్లాలో ఐదు చెక్ పోస్టులు

**నిర్మల్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, అక్రమ మద్యం, నగదు, బహుమతుల తరలింపును అడ్డుకోవాలని ఆయన ఆదేశించారు. ఐదు ఎస్ఎస్‌టి చెక్ పోస్టులలో 24 గంటలూ వాహనాలను తనిఖీ చేస్తారని, రూ.50 వేలకు మించిన నగదు ఉంటే సరైన పత్రాలు చూపాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు స్వామి, ఫనిధర్, ఎస్ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## గోదావరి ఘాట్ల వద్ద ముమ్మరంగా పారిశుద్ధ్యం!

**ఖానాపూర్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** బాసర క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గోదావరి పుష్కర ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆలయ శానిటేషన్ అధికారి రాజేందర్ పర్యవేక్షణలో వాగ్దేవి సొసైటీ సిబ్బంది ఘాట్లపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. అనంతరం మెట్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## పిల్లలు పుట్టడం లేదని ఉరేసుకుని ఆత్మహత్య

**ముథోల్, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ఇచ్చోడ మండలం అడేగాం (కె)కు చెందిన సాగర్, ఆదిలాబాద్ (రూ) మండలం అంకోలికి చెందిన వెంకటమ్మతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. అత్తగారింటి వద్ద నివసిస్తున్న సాగర్, సంతానం కలగకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై అంకోలి శివారులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విష్ణువర్ధన్ వివరాలు సేకరించారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు ప్రారంభం

**సిరిసిల్ల, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర కోసం ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం పరిశుభ్రత పనులు, ప్రత్యేక పార్కింగ్, చలువ పందిళ్లు, తాత్కాలిక టెంట్లు, టాయిలెట్లు, విద్యుత్ దీపాలు, అదనపు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## సిట్ విచారణ.. డైవర్షన్ గేమ్: కేటీఆర్

**వేములవాడ, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ పేరుతో డైవర్షన్ గేమ్ ఆడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. వరుసగా విచారణ చేస్తుంటే తమకు అనుమానం వస్తోందన్నారు. తెలంగాణభవన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీకి సుప్రీంకోర్టు ఇటీవల నోటీసులు ఇచ్చిందని, దివాలా తీసిన సంస్థకు రూ.6వేల కోట్ల టెండర్లు ఇచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి బాగోతం బయటపడిందని, రేవంత్ సీఎం కాదు.. ఆయన్ను ఒకరు నడిపిస్తున్నారని తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**ధర్మపురి, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురి పట్టణంలోని 1, 9వ వార్డుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులు మంజూరు చేస్తానని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ధర్మపురి ఆలయాభివృద్ధిని విస్మరించారని మంత్రి విమర్శించారు.

## బీఆర్ఎస్ పాలనలోనే పట్టణాభివృద్ధి

**కోరుట్ల, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు, ప్రజాప్రతినిధులనే ఎన్నికల్లో ఎన్నుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని రాజ కళామందిర్ రోడ్డులోని 16, 17, 18 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలోనే పట్టణాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు ఆలోచించి నిజాయతీగా సమస్యలను పరిష్కరించే అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు.

## ఆటో యూనియన్ సభ్యుడికి ఆర్థిక సాయం అందజేత



**ఖమ్మం, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా ఖమ్మం నగరంలో ఏఐటియుసి మమతా జనరల్ హాస్పిటల్ ఆటో యూనియన్, వి.ఆర్.కే సిల్క్ ఆటో అడ్డా, ప్రైవేట్ అంబులెన్స్ యూనియన్ కమిటీ సభ్యులు తమ సహచర సభ్యుడు పశువులేటి ఉపేందర్‌కు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఉపేందర్‌కు యూనియన్ సభ్యుల నిర్ణయం మేరకు రూ.5,000 నగదు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డా అధ్యక్షుడు ప్రతాపని ఉపేందర్, కార్యదర్శి లింగంపల్లి వెంకట్, ఉపాధ్యక్షుడు ఎస్.కే. అక్రమ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎమ్.డి. జాకీర్ ఉద్దీన్, ఇతర సీనియర్ సభ్యులు పాల్గొన్నారు. యూనియన్ సభ్యులు ఉపేందర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కులగణనపై ఓబీసీల సందేహాలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అసలే బీసీలను బీజేపీ ప్రభుత్వం పట్టించుకుంటోంది అంతంతమాత్రమే!! ఇప్పుడు జనగణనలో కులగణనను కేంద్రం చేస్తున్నప్పటికీ ఓబీసీ కాలం క్యాస్ట్ లేకపోవడం తీరని అన్యాయం. జాతీయ జనగణనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణన డాక్యుమెంట్‌లో ఎస్సీ, ఎస్టీల కాలమ్ పెట్టినప్పటికి ఓబీసీ కాలమ్ లేకుండా కులం అనే కాలమ్ మాత్రమే పెట్టి బీజేపీ ప్రజలను మోసం చేస్తోంది.దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు సరైన లెక్కలే లేవని, బీసీలకు అందాల్సిన రిజర్వేషన్ అందడం లేదు. ఇక తాజా కులగణనలో బీసీ కాలమ్ లేకపోవడం యావత్ బీసీ ప్రపంచానికే ప్రమాదకరం.. ఇప్పటికే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారిని వాడుకుంటున్నారు.. 75 ఏళ్లుగా బీసీల కులగణన లేకపోవడం దురదృష్టకరం, 33 అంశాల్లో ప్రత్యేకంగా 'బీసీ కాలమ్' ఉండాలి. అన్ని వర్గాలకు న్యాయం జరగాలని అన్నారు. అందుకోసం కులగణనలో ఎస్సీ, ఎస్టీలలో పాటు బీసీలకు కాలమ్ ఉండాలి!

జనగణన 2021లో చేయాల్సి ఉండగా కొవిడ్ కారణంగా చేయలేదు. కులగణనపై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించిందని స్పష్టంగా తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీల కాలం పెట్టి, ఓబీసీ అని లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్‌లో పెట్టారు. బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి.. కుల గణన విషయంలో బీజేపీ మాట తప్పినట్టు స్పష్టంగా తెలుస్తోంది. కులగణలో కులం కేటగిరీతో పాటు సబ్ కేటగిరీ ఉండాలి. జనగణనలో బీసీలను మోసం చేసే కుట్ర జరుగుతోంది. కులాల పేర్లతో పంచాయితీ పెట్టి ప్రజలను విడదీయడమే వీరి ప్లాన్ అని అనిపిస్తోంది. 1953లో, 1979లో, 2017లో ఏర్పడిన బీసీ కమిషన్ల సిఫార్సులు అరకొరగానే అమలయ్యాయి. ఒక కమిషన్ గడువును 13 సార్లు పొడిగించినా ఇంతవరకు నివేదికను ప్రభుత్వానికి సమర్పించలేదు. 2011లో జరిగిన సామాజిక ఆర్థిక కుల గణన వివరాలు ఉన్నాయని చెప్పిన కేంద్రం ఆ వివరాలు ఎందుకో బయట పెట్టకుండా దాటవేసింది. దేశంలో సగానికి పైగా జనాభా ఉన్న బీసీల విషయంలో కేంద్రం లెక్కలేనితనం చూపడం దారుణమైనది. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారు వీళ్ల ఆర్థిక స్థితి గతులేమిటి వీరి చదువులు ఎలా ఉన్నాయి వీరి ఉద్యోగ అవకాశాలేమిటి లాంటి విషయాలలో ఇప్పటి వరకూ ఓ క్లారిటీ లేదు.. పశువుల, వన్య ప్రాణుల లెక్కలను క్రమం తప్పకుండా తీసే ప్రభుత్వానికి, బీసీ లెక్కలు తీయాలన్న విజ్ఞతను కనబరచపోవడం అమానవీయం. బీసీలను పశువులకన్నా తక్కువ చేసి చూడడం దుర్మార్గం. దేశంలో మెజారిటీ ప్రజలైన బీసీల అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి మాది ప్రజారంజక ప్రభుత్వం అని చెప్పుకోవడం సిగ్గుచేటు. హక్కుల సాధనకు ఉద్యమించిన రైతులను జైళ్లపాలు చేశారు.. ఉద్యమకారులపై పి.డి., ఉగ్రవాద చట్టాలను అమలు చేశారు. ఇలాంటి చర్యలు గతంలో ఎప్పుడూ ఈ దేశంలోని ప్రజలు ఎదుర్కొలేదు. ఇప్పటికైనా బీసీల ప్రధాన డిమాండ్‌ను పూర్తి చేయడం కేంద్రానికి కూడా చాలా మంచిది. దేశంలో బీసీల జనాభా 70 కోట్లు, మొత్తం జనాభాలో ఇది 56% అని అంచనా. 90 ఏళ్ల నాటి డేటా ఆధారంగానే కొనసాగుతున్న రిజర్వేషన్లు.. కులాల లెక్కలతోనే బీసీల అసలు జనాభా తెలుస్తుంది. కుల గణన చేపట్టాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పది సంవత్సరాలకు ఓ సారి దేశంలో జనాభాను లెక్కిస్తున్నా.. అందులో దళితులు, ఆదివాసీల సంఖ్య పైన మాత్రమే స్పష్టమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే జనాభాలో ఓబీసీతో పాటు ఏఏ కులాల వారు ఎంతమంది ఉన్నారన్న సమగ్ర సమాచారం సేకరించడం లేదు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ పార్టీ దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం చేస్తూనే ఉంది. సామాజిక న్యాయం పేరుతో మాటలు చెప్పే బీజేపీ, అధికారంలో ఉన్న చోట బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించ డంలో పూర్తిగా విఫలమైంది. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే రిజర్వేషన్ల పెంపు తప్పనిసరి. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలి.

# సర్వశక్తులు ఒడ్డుతున్న హస్తం పార్టీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ సర్వేలతో సర్వం పసిగట్టిందా.. అసలు ఈ సర్వేలు తమకి అనుకూలంగా ఉన్నాయా..? ప్రతికూలంగా ఉన్నాయా..? ఓ వైపు ప్రయివేట్ సంస్థల సర్వేలు,మరోవైపు ప్రభుత్వ ఇంటిలిజెన్స్‌సర్వేలలో ఎక్కడ ద్విముఖ పోరు ఉండనుంది? ఎన్ని స్థానాల్లో త్రిముఖ పోరు ఉంటుంది...కొన్ని స్థానాల్లో నేతలకు సీఎం డైరెక్ట్ కాల్ చేసి భరోసా ఇవ్వడంలో మతలబు ఏంటి..? ఇంతకీ మున్సిపోల్స్ హస్తంపార్టీ

**హస్తగతం అయ్యేనా..?..**

కాంగ్రెస్ నేతలు మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్ పెంచుతున్నారు. హస్తం నేతలు నాలుగు ప్రయివేట్ సంస్థలతో చేయించిన సర్వే రిపోర్టులు అందినట్లు సమాచారం. ప్రయివేట్ సంస్థల రిపోర్టులతో పాటు ప్రభుత్వ ఇంటిలిజెన్స్ రిపోర్టులను అధ్యయనం చేసిన హస్తం నేతలు తాము అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యే అవకాశం ఉందని ధీమాగా ఉన్నారు. విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ సైతం తెలంగాణకి రావడంతోనే సర్వే రిపోర్టులు పరిశీలించినట్లు సమాచారం. రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నాయని, ఎలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటే తొంభై శాతం స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవచ్చని నేతలకు

**దిశానిర్దేశం చేసినట్లు సమాచారం..**

సర్వే రిపోర్టులు తమకి అనుకూలంగా ఉన్నప్పటికీ పలు విషయాల్లో హస్తం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తర తెలంగాణలో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లుసర్వేల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతం కావడంతో పాటు అర్బన్ ప్రాంతంలో హిందుత్వ ప్రభావం ఉండడంతో ఉత్తర తెలంగాణలోని పలు మున్సిపాలిటీలలో బీజేపీకి అనుకూలంగా ఉంది. ఆ స్థానాల్లో త్రిముఖ పోరు ఉండనున్నట్లు హస్తం నేతలు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ ఉన్న దగ్గర ఏవిధంగా ప్రచారం చేయాలో సీఎం రేవంత్ నేతలకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. మైనార్టీ ఓటుబ్యాంకు కాంగ్రెస్ కు పడే విధంగా చూడడంతో పాటు, హిందుత్వ ఓటు బ్యాంకు చీలకుండా ఉండేందుకు సీఎం రేవంత్ కొత్త ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాలను నేతలకు వ్యక్తిగతంగా కాల్ చేసి వివరించడానికిల

**సీఎం సిద్ధమైనట్లు సమాచారం..**

దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు సర్వేల్లో వెల్లడింది. ఈ ప్రాంతంలో దాదాపుగా ద్విముఖ పోరు ఉంటుందని హస్తం నేతలు అంచనా వేశారు. ఈ స్థానాల్లో గత పదేళ్లలో కేసీఆర్ చేసిన వైఫల్యాలను ఎండగట్టేలా ప్రచార వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇక పార్టీకి ఇబ్బందిగా ఉన్న నియోజవర్గాల లిస్ట్ కూడ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో లోకల్‌గా ఉన్న సమస్యలను గుర్తించి దానికి అనుగుణంగా మేనిఫెస్టో సిద్ధం చేయాలని సీఎం రేవంత్ సూచించినట్లు సమాచారం.

**వాయిస్..**

నాయకుల మధ్య అంతర్గత పోరు, ఆధిపత్య ఇబ్బందులున్న నియోజకవర్గాలను సైతం ప్రత్యేకంగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఆయా నియోజవర్గాల నాయకుల మధ్య సమన్వయం కుదిర్చే బాధ్యతను పలువురు సీనియర్ నేతలకు సీఎం రేవంత్ అప్పగించారు. ఆ నేతలు సీఎం రేవంత్ దూతగా ఆయానియోజకవర్గాలకు వెళ్లి నేతలతో మాట్లాడి వారి మధ్య సమన్వయం కుదిర్చి రావాలని సీఎం రేవంత్ ఆదేశించారు.సర్వేలు అనుకూలంగా ఉన్నాయి కదా అని నేతలు రిలాక్స్ అయితే ఊరుకునేది లేదని సీఎం వార్నింగ్‌ఇచ్చినట్టు సమాచారం. ఎన్నికలు ముగిసి మున్సిపల్ చైర్మన్ల, మేయర్ల ఎన్నిక జరిగేదాక కీలక నేతలంతా నియోజకవర్గాల పరిధిలోనే ఉండాలని సీఎం ఆదేశించారు. ఇక తొంబై శాతం టార్గెట్ పెట్టుకున్న కాంగ్రెస్ ఎంత శాతం సక్సెస్ అవుతుందో వేచి చూద్దాం...


# తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

**శుభాకాంక్షలు తెలియచేసిన సీఎం రేవంత్**

**హైదరాబాద్ పెన్ పవర్:** "తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం" సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం, సామాజిక సాధికారత కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఒక బాధ్యతగా, 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే' ను ఎంతో నిబద్ధతతో శాస్త్రీయ పద్ధతిలో పూర్తి చేసిందని గుర్తుచేశారు. అంతే కాకుండా, దశాబ్దాల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు పరిష్కారం చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. అన్ని వర్గాలకు సమాన, సముచిత న్యాయం కల్పించాలనే ఆశయంతో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, ప్రతి ఏటా ఫిబ్రవరి 4వ తేదీని తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తుచేశారు. సామాజిక న్యాయం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పునరుద్ఘాటించారు.

## గుర్రంగూడా బంజారా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 4పెన్ పవర్:** గుర్రంగూడా బంజారా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షులుగా బానావత్ మోతిలాల్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా కేతావత్ కిరణ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా మూడవత్ అశోక్ నాయక్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు రతన్ నాయక్, భాను నాయక్ ల చేతుల మీదుగా వీరు ప్రమాణం చేశారు. అనంతరం అధ్యక్షులు మోతిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి అశోక్ నాయక్ లు మాట్లాడుతూ, గుర్రంగూడా బంజారా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొర్ర శంకర్ నాయక్ తో పాటు పలువురు సభ్యులు, బంజారా ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీ చరిత్రలో సరికొత్త అధ్యాయం 6న క్వాంటమ్ వ్యాలీకి భూమి పూజ

**విజయవాడ, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది.. చంద్రబాబు కలల ప్రాజెక్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడబోతోంది. ఈ నెల 6న అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించి భూమిపూజ చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సమీక్షించారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అమరావతిలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కలల ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ దిశగా మరో కీలక ముందడుగు పడింది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు సంబంధించిన భూమిపూజకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందేమరోవైపు అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ పేరుతో ఓ యూనివర్శిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఐటీశాఖ ప్రతిపాదనపై ఇవాళ జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తారు. ఈ వర్శిటీలో స్కూల్ విద్యార్థుల నుంచి పీజీ వరకు ఏఐలో విద్యా బోధన ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రానుండటంతో ఈ వర్శిటీ అనుబంధంగా ఉంటుందని చెబుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఓ గేమ్ ఛేంజర్ అంటోంది ప్రభుత్వం. ఇటీవల 14మంది ప్రముఖ నిపుణులతో రెండు కమిటీలను కూడా నియమించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో మరిన్న కంపెనీలను ఆకర్షించాలని భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలు రావడం ఖాయం అంటున్నారు.ప్రపంచవ్యాప్తంగా అందరూ క్వాంటమ్ టెక్నాలజీపై ఫోకస్ పెట్టారని చంద్రబాబు చెబుతున్నారు.

అమరావతి

క్వాంటమ్ వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారబోతోందన్నారు. ఏకంగా లక్ష మంది నిపుణుల తయారీ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇప్పటికే క్వాంటమ్ శిక్షణకు సంబంధించి 50వేలమంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు రిజిస్టర్ చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీపై మరింత ఫోకస్ పెడతామన్నారు. ఒకవేళ ఎవరైనా క్వాంటం టెక్నాలజీ ద్వారా నోబుల్ ప్రైజ్ దక్కించుకుంటే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని రూపొందించిన విషయం తెలిసిందే. అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# ఇక బెంగళూరు ఆరుగంటలే

**కర్నూలు, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** ఏపీలో నేషనల్ హైవే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయి. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగి ఇటీవల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కనెక్టివిటీకి సంబంధించి ప్రాజెక్టులపై ఆరా తీశారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో 167కే హైవే పనులు వేగవంతం చేశారు. ఈ నేషనల్ హైవే అందుబాటులోకి వస్తే బెంగళూరు తర్వగా వెళ్లొచ్చు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించిన పనుల్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో బెంగళూరుకు కనెక్ట్ చేసే కీలకమైన నేషనల్ హైవే (167కే) పనులు స్పీడ్ అందుకున్నాయి. ప్రస్తుతం నంద్యాల నుంచి కోవెలకుంట్ల మీదుగా నొస్సం వరకు 62 కిలో మీటర్ల హైవే పనులు చేపట్టారు.. అక్కడి నుంచి జమ్మలమడుగు కడప రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే.. 60 నుంచి 65 కిలో మీటర్ల దూరం తగ్గుతుందని.. బెంగళూరుకు 6 గంటల్లోపు వెళ్లొచ్చంటున్నారు.ఈ జాతీయ రహదారి 167కే నిర్మాణం కోసం 691.81 కోట్లు విడుదల చేశారు.. మొత్తం 486 ఎకరాల భూమిని సేకరించారు. నంద్యాల జిల్లాలోని ఆరు మండలాల్లోని (కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, నంద్యాల, సంజామల, గోస్పాడు)



22 గ్రామాల మీదుగా వెళుతోంది. మూడుచోట్ల బ్రిడ్జిలు.. అలాగే 158 చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ హైవేలో నాలుగు ప్రాంతాల్లో బైపాస్‌లు (కోవెలకుంట్ల, రైతునగరం, నొస్సం, గోస్పాడు) కూడా నిర్మిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బైపాస్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. బైపాస్‌లు అందుబాటులోకి వస్తే నంద్యాల నుంచి నొస్సం గంటలోపే వెళ్లొచ్చు.ఈ హైవే పూర్తిచేస్తే కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజలకు బెంగళూరుతో కనెక్టివిటీ పెరుగుతుంది. ఎందుకంటే రెండు జిల్లాల నుంచి బెంగళూరుకు వెళ్లేవారిలో.. ఐటీ ఉద్యోగులు, ఉపాధి కోసం వెళ్లేవారు, వ్యాపారులు ఉంటారు. వారందరికి ప్రయాణ సమయం తగ్గుతుంది. గతంలో బెంగళూరు వెళ్లాలంటే అవుకు, కొలిమిగుండ్ల మీదుగా తాడిపత్రి, అనంతపురం మీదుగా వెళ్లేవారు. అదే 167కే జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే.. జమ్మలమడుగు, ముద్దనూరు మీదుగా తాడిపత్రి హైవేలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా బెంగళూరుకు త్వరగా వెళతారు. అలాగే ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిది కూడా కర్నూలు జిల్లా కావడంతో ఆయన కూడా ఈ హైవే పనుల్ని వేగవంతం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మొత్తం మీద బెంగళూరు వెళ్లేవారికి కీలకమైన హైవే పనులు ఊపందుకున్నాయి.

# వైసీపీకి వరుస షాకులు



**నెల్లూరు, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు.ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి.తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు.మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాన్ వర్కౌటవుతుందా

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంమయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు.మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు.ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

## మరో వివాదంలోమంచు ఫ్యామిలీ



**తిరుపతి, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** మంచు మోహన్ బాబు, మంచు విష్ణు మరోసారి వార్తల్లోకి ఎక్కారు. తిరుపతి లో మోహన్ బాబు యూనివర్సిటీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ ఎఫ్ ఐ సంఘం వాళ్ళను కిడ్నాప్ చేయించారని మోహన్ బాబు, మంచు విష్ణు, సతీష్ లపై తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. రీసెంట్ గానే రేణుగుంట విమానాశ్రయం లో పోలీసులు సతీష్ ని అదుపులోకి తీసుకున్నారు. మరి ఇప్పుడు మోహన్ బాబు, మంచు విష్ణులను కూడా అదుపులోకి తీసుకుంటారో లేదో చూడాలి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మోహన్ బాబు యూనివర్సిటీ లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని చాలా కాలం నుండి ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. మోహన్ బాబు చిన్న తనయుడు మంచు మనోజ్ కూడా ఈ విషయం పై పెద్ద పోరాటమే చేసాడు. కొట్లాట వరకు వెళ్లి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది.అయితే రీసెంట్ విద్యార్థి సంఘాలు కూడా మోహబ్ బాబు యూనివర్సిటీ ఎదుట ధర్నాలు చేయడం మొదలు పెట్టాయి. విద్యార్థుల నుండి అన్యాయంగా అధిక ఫీజులు వసూలు చేసారని, తక్షణమే వాళ్లకు ఆ ఫీజులను తిరిగి చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన మోహన్ బాబు తన బౌన్సర్ల చేత వాళ్ళను కిడ్నాప్ చేయించినట్టు తెలుస్తోంది. కారులో వచ్చిన మోహన్ బాబు బౌన్సర్లు సినీ ఫక్కీలో విద్యార్థుల సంఘాల నేతలను ఎక్కించుకొని, మోహన్ బాబు ఫామ్ హౌస్ లో బంధించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే మోహన్ బాబు ఫామ్ హౌస్ కి వెళ్లి విద్యార్థుల సంఘం నేతలను విడిపించి బౌన్సర్లను అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యవహారం పై మోహన్ బాబు ఎలాంటి రెస్పాన్స్ కూడా ఇవ్వలేదు.విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన అదనపు ఫీజులను తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మోహన్ బాబు పట్టించుకోకపోవడం తో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యం లో వాళ్ళ బాధను అర్థం చేసుకున్న రాఖీ× సంఘం, మరియు ఇతర విద్యార్థుల సంఘాలు యూనివర్సిటీ వద్ద ధర్నా చేపట్టి విద్యార్థుల బాధని మోహన్ బాబు కి అర్థం చేసే ప్రయత్నం చేశారు. అలాంటి వాళ్లకు సర్దిచెప్పి పంపాల్సింది పోయి, అహంకారంతో ఇలా కిడ్నాప్ చేయడం అమానుషం అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## ఆ మూడు సీట్లు దక్కేదెలా

**విజయవాడ, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఒక లోటు ఉంది. రాష్ట్రమంతటా గెలిచామని ఆ పార్టీ భావిస్తోంది. కానీ ఓ మూడు చోట్ల మాత్రం ఆ పార్టీకి ఇప్పటివరకు విజయం దక్కలేదు. జగన్ ప్రభంజనంలో సైతం ఆ మూడు చోట్ల టిడిపి విజయం సాధించింది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నో రకాల ప్రయోగాలు చేసింది. కానీ ఆ ప్రయోగాలు ఏవి ఫలించలేదు. ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చింది. ఆ మార్పు ఎంతవరకు కూడా లాభం చేకూర్చలేదు. పైగా ఎంపీలుగా పోటీ చేసిన వైసీపీ నేతలకు అడ్రస్ లేకుండా పోయింది. రాజకీయ జీవితం లేకుండా పోయింది. ముఖ్యంగా విజయవాడ నుంచి పోటీ చేసిన ముగ్గురు నేతలు వైసీపీలో లేకుండా పోయారు. అందుకే ఇప్పుడు బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని చూస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎవరూ చిక్కడం లేదు. విజయవాడలో పోటీ అంటేనే నేతలు భయపడిపోతున్నారు.2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ బలమైన అభ్యర్థి అవుతారని భావించి.. పారిశ్రామికవేత్త కోనేరు ప్రసాద్ ను రంగంలోకి దించింది. అంతకు ముందు రెండు ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఎక్కువగా ఉంటుందని భావించింది. కానీ వైసీపీ లెక్కలు తప్పాయి. టిడిపి అభ్యర్థి కేసినేని నాని ఘనవిజయం సాధించారు. అయితే ఆ ఎన్నికల తరువాత కోనేరు ప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అయితే అప్పట్లో కూడా విజయవాడ పార్లమెంటు స్థానం దక్కించుకోలేకపోయింది. రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కేసినేని నాని ఇక్కడ ఘనవిజయం సాధించారు. ఆర్థిక బలం ఉన్న పొట్లూరు వరప్రసాద్ ను రంగంలోకి దించింది. ఆయన ప్రముఖ నిర్మాతగా కొనసాగుతుండగా పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు జగన్. అయితే రాష్ట్రమంతటా ప్రభంజనం వీచింది కానీ .. విజయవాడలో మాత్రం టిడిపి అభ్యర్థి కేసినేని నాని గెలిచి పట్టు నిలుపుకున్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పొట్లూరు వరప్రసాద్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. క్రమేపి రాజకీయాలకు సైతం గుడ్ బై చెప్పారు.2024 ఎన్నికల్లో అనూహ్యంగా రెండుసార్లు ఎంపీగా పోటీ చేసి గెలిచిన కేశినేని నాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. అంతకుముందు రెండుసార్లు గెలిచేసరికి అదంతా తన చరిష్మ అన్నట్టు భావించారు. అయితే ఆయన పై టిడిపి అభ్యర్థిగా తమ్ముడు కేసినేని చిన్ని పోటీ చేసి గెలిచారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కేశినేని నాని ప్రకటించారు. అయితే విజయవాడలో పోటీ చేస్తున్న వారంతా ఇలా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సెంటిమెంట్ గా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

## కాపు సామాజికవర్గం కోసం...

**ఏలూరు, ఫిబ్రవరి 4 పెన్ పవర్:** 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్ టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఆయిల్ కొనుగోళ్లు భారత్ నిలిపివేసిందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయిల్ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు రష్యాకు భారత్ నుంచి ఎలాంటి సమాచారం లేదని ఆ దేశ అధ్యక్ష భవనం క్రెమ్లిన్ మంగళవారం తెలిపింది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే, భారత్‌తో అన్ని సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలని రష్యా భావిస్తోందని పెస్కోవ్ తెలిపారు. భారత్– అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందని, దీని ప్రకారం రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయడానికి భారత్ అంగీకరించిం దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన ఒక రోజు తరువాత పెస్కోవ్ ఈ విషయాన్ని తెలిపారు. అయితే రష్యాకు ఎలాంటి సమాచారం లేకపోయినా, ఆ దేశం నుంచి భారత్ చేస్తున్న చమురు కొనుగోళ్లు గణనీయంగా తగ్గినట్టు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కప్లెర్ సమాచారం ప్రకారం ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి భారత్ చేసిన ఆయిల్ కొనుగోళ్లు ఒక మిలియన్ బ్యారెళ్లకు పడిపోయాయి. అంతకు ముందు నెలలో ఇది రెండు మిలియన్ బ్యారెళ్లుకు పైగా ఉండేది. మరోవైపు కప్లెర్ సమాచారం ప్రకారం రష్యాకు బదులుగా ఇరాక్ నుంచి భారత్ చమురు కొనుగోళ్ళు పెరిగాయి. అలాగే, సౌదీ అరేబియా నుంచి కూడా కొనుగోళ్లుపెరిగినట్టు కప్లెర్ తెలిపింది. భారత్ తనకు అవసరమయ్యే ముడి చమురులో 88 శాతాన్ని విదేశాల నుంచే కొనుగోలు చేస్తుంది.

## డాలర్ ఆధిపత్యానికి చెక్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా డాలర్ కోటను బద్దలుకొట్టడానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సరికొత్త వ్యూహరచన చేస్తున్నారు. చైనా కరెన్సీ అయిన 'యువాన్'ను అంతర్జాతీయ స్థాయిలో అత్యంత 'బలమైన కరెన్సీ'గా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. డాలర్‌పై ఆధార పడటాన్ని తగ్గించుకోవడమే కాకుండా, యువాన్‌ను 'గ్లోబల్ రిజర్వ్ కరెన్సీ'గా మార్చడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శనివారం కమ్యూనిస్ట్ పార్టీ అధికారిక పత్రిక 'కియుషి'లో ప్రచురితమైన ఒక వ్యాసంలో జిన్‌పింగ్ ఈ విషయాలను వెల్లడించారు. ఆ వ్యాసంలో జిన్‌పింగ్ అమెరికా డాలర్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. కానీ ఉద్దేశం మాత్రం స్పష్టంగా అర్థమవు తోంది. 2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జిన్‌పింగ్ డాలర్ ఆధిపత్యానికి గండి కొట్టాలని చూస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడులు, విదేశీ మారక ద్రవ్య మార్కెట్లలో యువాన్ వాడకాన్ని భారీగా పెంచాలని ఆయన సూచించారు. చైనాను ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా మార్చడానికి 'బలమైన కరెన్సీ' అత్యవసరమని తేల్చిచెప్పారు.

## యూఎస్ చర్యను వ్యతిరేకిస్తూ వెనిజులాలో భారీ నిరసన ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:** అధ్యక్షుడు మదురో, ప్రథమ మహిళ సిరిలా ఫ్లోర్స్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వెనిజులా ప్రజలు దేశవ్యాప్తంగా వినూత్న నిరసన చేపట్టారు. దేశ రాజధాని కారకాస్ సహా పలు నగరాల్లో సోమవారం రాత్రి నుండి మంగళవారం తెల్లవారుజాము వరకు జాగరణ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. తమ దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని డిమాండ్ చేయడంతో పాటు బలీవియన్ విప్లవానికి తమ ధృడమైన మద్దతును పునరుద్ఘాటించారు. వెనిజులాపై సాయుధ దురాక్రమణకు దిగి, అధ్యక్ష దంపతులను అమెరికా కిడ్నాప్ చేసి నెలరోజులు పూర్తవడంతో నిరసన చేపట్టినట్లు యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా (పిఎస్‌యువి, స్పానిష్‌లో) ప్రధాన కార్యదర్శి డియోస్డాడో కాబెల్లో తెలిపారు. రాజధాని కారకాస్‌లో, అల్టాగ్రాసియా పారిష్‌లోని ఉర్దనేటా అవెన్యూలో లైవ్ మ్యూజిక్‌ను నిర్వహించారు. సార్వభౌమాధికారం మరియు స్వాతంత్ర్యానికి మద్దతునిస్తున్నామని, అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సామ్రాజ్యవాద జోక్యాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు.

## విమానంలో ప్రయాణికురాలిపై భారతీయుడి లైంగిక వేధింపులు

**హైదరాబాద్ పెన్ పవర్:** విమానంలో తోటి ప్రయాణికురాలిపై ఓ భారతీయుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ కేసులో ఆ వ్యక్తిని అమెరికా (జూం) న్యాయస్థానం దోషిగా తేల్చింది. కోర్టు రికార్డుల ప్రకారం.. వరుణ్ అరోరా (38) అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్నాడు. 2024 ఆగస్టులో రోడ్ ఐలాండ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోనాల్డ్ రీగన్ వాషింగ్టన్ విమానాశ్రయానికి వెళ్లాడు. ఆ సమయంలో విమానంలో నిద్రపోతున్నట్టు నటిస్తూ.. తోటి ప్రయాణికురాలితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో బాధితురాలు పలుమార్లు హెచ్చరించినా వేధింపులు కొనసాగించాడు. విమానం గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత బాధితురాలు ఆ వ్యక్తి ఫొటో తీసి.. విమానయాన సంస్థకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్‌బీఐ అధికారులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గతేడాది ఆగస్టులో అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి నేరం నిర్ధరణ కావడంతో ఫెడరల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి త్వరలోనే శిక్ష ఖరారు చేయనున్నారు. ఈ కేసులో అతడికి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఇయు, అమెరికాతో ఒప్పందాల గుట్టు విప్పండి

**హైదరాబాద్ పెన్ పవర్:** యురోపియన్ యూనియన్‌తో, అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వివరాలను పార్లమెంట్‌కు అందచేయాలని ప్రతిపక్షాలు లోక్‌సభలో డిమాండ్ చేశాయి. పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోవాలని, ఒప్పందాలపై ఉభయ సభల్లో చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాగా ప్రతిపక్షం అనుసరిస్తున్న పద్ధతిపై రాజ్యసభలో పాలక పక్ష నేత జె.పి.నడ్డా తీవ్రంగా విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అన్ని వివరాలను ప్రభుత్వం అందచేస్తుందని చెప్పారు.దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై తాను మాట్లాడాలనుకుంటున్నానంటూ అంతకుముందు లోక్‌సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా, పాలక పక్ష సభ్యులు అడ్డుకున్నారు. ఈ దశలో ఇరు పక్షాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ దశలో ప్రతిపక్ష సభ్యులు కొందరు స్పీకర్ కుర్చీ వైపు కాగితాలు చించి విసిరివేశారు. దీనిపై వెంటనే స్పీకర్ చర్యలు తీసుకున్నారు. సిపిఎం ఎంపిని, ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలను ఈ సమావేశాల కాలానికి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. వారిలో సిపిఎం ఎంపి ఎస్.వెంకటేశన్, కాంగ్రెస్ సభ్యులు అమరిందర్ సింగ్ రాజా వారింగ్, గుర్దీప్ సింగ్ అజ్లా, హిబి ఎడెన్, డీన్ కురియకోస్, ప్రశాంత్ పడోల్, కిరణ్ కుమార్ రెడ్డి, మాణిక్యం ఠాగూర్ వున్నారు. అనంతరం లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది. అంతకుముందు మాజీ ఆర్మీ చీఫ్ నవరణె రాసిన పుస్తకంలోని వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తన వాదనను కొనసాగించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నించగా, స్పీకర్ ఓం బిర్లా అనుమతించకపోవడంపై రాహుల్ అభ్యంతరం తెలిపారు. ప్రతిపక్ష నేతగా తనను భారత్–చైనా సరిహద్దు సంఘటనలపై మాట్లాడేందుకు ఎందుకు అనుమతించడం లేదంటూ ప్రశ్నించారు.

# అడ్వర్టయింజింగ్ దిగ్గజం ఏజీకే

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవులు పుడతారు. చనిపోతారు. కొంతమంది మాత్రమే తమ జీవితంలో మేథో మథనంతో, స్వయం కృషితో, ప్రజలకు గుర్తుండే, పనులు చేసి, చిరస్థాయిగా నిలిచి పోతారు. ప్రచార రంగంలో అలాంటి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజం ఎ.జి.కృష్ణమూర్తి.

దేశంలోనే ప్రచార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ముద్ర' వ్యవస్థాపకుడు ఎ.జి.కృష్ణమూర్తి. ముద్రా కమ్యూనికేషన్స్ (ఓబీటతీజీ అనీఎఎబీనితిఇజీబితినీనిబ) సంస్థాపక అధ్యక్షుడు ఎ. జి. కృష్ణమూర్తి. కేవలం 35 వేల నగదు తో, ఒకే ఒక క్లయింట్ తో వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించి, కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారతదేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకునెలా కృషి చేశారు. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఈ సంస్థని ఇంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయనచేత శభాష్ అనిపించు కున్నారు.ఎ.జి.కృష్ణమూర్తి (అచ్యుతాని గోపాల కృష్ణమూర్తి) 1942, ఏప్రిల్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. అయన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షులు. తెలుగువారు గర్వించదగ్గ వ్యాపార దిగ్గజం. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో బి.ఏ హానర్స్ పట్టా పుచ్చుకొని 1968లో 60, 70వ దశకాలలో వస్త్ర పరిశ్రమలో బాగా పేరున్న కాలికో మిల్స్ లో గిరాబెన్ సారాభాయికి సహాయకుడిగా చేరారు. 1972లో అదే కంపెనీకి చెందిన వ్యాపార ప్రకటన సంస్థ అయిన "శిల్పా అడ్వర్టైజింగ్" లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ గా పదోన్నతి పొందారు. 1976లో రిలయన్స్ సంస్థలకు ఆడ్వర్టైజింగ్ మేనేజరుగా చేరి, నాలుగు సంవత్సరాలు తిరక్కుండానే సొంత వ్యాపార ప్రకటనా సంస్థ "ముద్రా కమ్యూనికేషన్స్" ను 1980, మార్చి 25న స్థాపించారు. రిలయన్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అడ్వర్టయిజింగ్ డైరెక్టర్‌గా చేరిన ఏజీకే అడ్వర్టయి జింగ్ రంగంలో శిఖర సదృశుడైన ఫ్రాంక్ సియాయిస్‌తో కలసి అద్భుతాలు చేశారు. రిలయన్స్ సంస్థ ఉత్పత్తి చేసిన సిల్కు చీరలూ, ఇతర దుస్తులకూ విమల్ బ్రాండ్‌తో ప్రకటనలు తయారు చేయడంలో ఫ్రాంక్ అనేక విన్యాసాలు చేశారు. 'ఓన్లీ విమల్' అన్నది అందరికీ, ఎప్పటికీ గుర్తు ఉండే సృజనాత్మక ప్రకటన. విమల్ కోసం తయారు చేసిన మొదటి అడ్వర్టయిజ్ మెంట్ ... "ఒక స్త్రీకి ఎన్నెన్నో మనోభావాలు". అడ్వర్టయిజ్ మెంటు రకరకాల రూపాలు సంతరించుకొని అత్యధికంగా పత్రికలలో, రేడియోలలో వచ్చి విమల్ చీరలకు అసాధారణమైన ఆదరణ తెచ్చింది. ఫ్రాంక్ సియాయిస్ సొంత ఏజెన్సీ పెట్టుకున్న తర్వాత, రిలయన్స్ ప్రత్యర్థులు ఆయన క్లయింట్లు అయిన కారణంగా రిలయన్స్ స్వయంగా ఒక అడ్వర్టయిజింగ్ ఏజెన్సీని నెలకొల్పాలనీ, దానికి 'ముద్ర' అని పేరు పెట్టాలనీ ఏజీకే చేసిన సూచనను ధీరూభాయ్ అంబానీ ఆమోదించారు. ఆయన రూ. 35 వేల నగదు తోను ఒకే ఒక క్లయింట్ తోను వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించారు. కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారత దేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకుంది. 1980లో ముద్ర వెలిసింది. ఒక వెలుగు వెలిగింది. కార్పొరేట్ రంగంలో "అడ్వర్టయింజింగ్ జీనియస్"గా ఏజీకే గుర్తింపు పొందారు. దేశ వ్యాప్తంగా విమల్ షోలు నిర్వహించి విమల్ విజయ పరంపరను కొనసాగించడంలో ఏజీకేది అద్వితీయమైన పాత్ర. 'ఐ లవ్ యూ రస్నా' కూడా ఆయన సృష్టే. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఆ సంస్థను అంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయన చేత శభాష్ అనిపించు కున్నారు. ఆయన తమ అనుభవాలను పుస్తకాల రూపంలోనూ,

పత్రికా శీర్షికల ద్వారా రాసి యువతను ఉత్తేజ పరిచారు. కృష్ణమూర్తి తెలుగు పత్రికలో వారం వారం అనే శీర్షికను, ఆంగ్ల పత్రికలలో ఏజికె స్పీక్ (ంఉఐ ాజూవజీ౨) అనే శీర్షికను రాశారు. ఆయన 'ధీరూభాయిజమ్' అనే పేరుతో తెలుగులో, ఇంగ్లిష్‌లో పుస్తకం రాశారు. 'ఎదురీత' పేరుతో మరో పుస్తకం రాశారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే ఆయన రచనలను వివిధ భారతీయ భాషలలోకి అనువదించారు. 'ఇదండీ నా కథ' అనేది ఏజీకే ఆత్మకథ. అదే ఆయన చివరి రచన. అంచెలంచెలుగా ఎదుగుతూ యాడ్స్ రంగ దిగ్గజ వ్యక్తుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్న కృష్ణమూర్తి తెలుగు, ఆంగ్లంలో 15కు పైగా పుస్తకాలు రచించారు. 2013లో ఇఫ్ యు కెన్ డ్రీమ్ పేరుతో తన ఆత్మకథను పుస్తక రూపంలో విడుదల చేశారు. ముద్రా కమ్యూనికేషన్స్ చైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత ఎ.జి.కె. బ్రాండ్ కన్సల్టింగ్‌ను స్థాపించారు. కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు అతి కొద్దికాలంలో పలు భారతీయ భాషల్లో ప్రచురింపబడి, ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. ఆయన 73వ యేట ఫిబ్రవరి 5, 2016న హైదరాబాదులో మరణించారు.

# బుర్రకథా పితామహుడు నాజర్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావ భావలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుర్రకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుర్రకథా పితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. " ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటి కాదు" అని తన కళను ప్రజా ప్రయోజనానికే అంకితం చేసిన ప్రజా కళాకారుడు. అంగాంగ విన్యాసాల ద్వారా ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన గొప్ప ప్రతిభాశాలి షేక్ నాజర్. నాజర్ ప్రతిభకు ముగ్ధుడైన సినీ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుర్రకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడిగా కొనసాగిన ప్రజా గాయకుడు నాజర్. బుర్రకథా పితామహుడుగా పేరొందిన షేక్ నాజర్ (ఫిబ్రవరి 5, 1920 – ఫిబ్రవరి 22, 1997) బుర్రకథా కళాకారుడు, నటుడు, ప్రజా రచయిత, గాయకుడు. పద్మశ్రీ అవార్డు గ్రహీత. గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఓ పేద దూదేకులముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5 వ తేదీన షేక్ మస్తాన్, బీబాబీలకు దంపతులకు జన్మించారు. నాజరు పూర్తి పేరు "షేక్ నాజరు వలి". మహ్మదీయ సభ పేరిట నాటకా లాడి మంచిపేరు గడించారు. ఆయన కృష్ణలీలలో దేవకి, శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాదుకా పట్టాభిషేకంలో కైకేయి, ఖిల్జీ రాజ్యపతనంలో కమలారాణి పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవం పోశారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. నాస్తికుడయ్యారు. తెనాలిలోని "బాలరత్న నాటక సమాజం"లో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలోచేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుర్రకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టు పార్టీ నెల జీతం మీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీ ప్రచారానికి ఉపయోగించు కున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు మొదలగు ఇతివృతాలలో సమకాలీన రాజకీయాలు జోడించి బుర్రకథలు రూపొందించారు. పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి... పింజారీ అనే పుస్తకంగా ప్రచురించాడు. కొంతకాలం విరసం సభ్యులుగా ఉన్నారు.అగ్గిరాముడు, బలేబావ, నిలువు దోపిడీ, పెత్తందార్లు, పుట్టిల్లు, మనుషులంతా ఒక్కటే – సినిమాల్లో నాజర్ బుర్రకథలు కన్పిస్తాయి. పూల రంగడు సినిమాలో "అక్కినేని"కి నేర్పించారు. చాలా మందికి ఈ గాంధర్వ విద్య నేర్పారు. ఆయన గళ గాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, "ఆసామీ" నాటకాన్ని రచించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో ఆసామి నాటకం ప్రథమ బహుమతి పొందింది. నాజర్ ఏడుసార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఆంధ్రనాటక అకాడమీ 1981లో "ఉత్తమ కళాకారుడు" అవార్డుతో సత్కరించింది. 1986 లో భారత ప్రభుత్వం "పద్మశ్రీ"

బిరుదుతో నాజరును సత్కరించింది. రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవా చార్యులు, నాజరు బుర్రకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం, మద్రాసులో ప్రదర్శన చూచిన గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించు కోవడం, ప్రముఖ పాత్రికేయుడు కె. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజా భాషకు ముగ్ధుడై ''నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో" అని ఆలింగనం చేసుకోవడం, నాజరు లోని కళా ప్రతిభకు తిరుగులేని నిదర్శనాలు."నాటకాల్లో బుర్రకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది" అని ప్రముఖ నటి జమున వ్యాఖ్యానించారు. గుంటూరుకు ఎన్‌టిఆర్ వచ్చినప్పుడు "నేను మీ అభిమానిని" అని నాజర్ చెపితే... ''నేను మీ ఫాన్‌ను" అని ఎన్‌టిఆర్ చెప్పి అందరినీ ఆనంద పరిచారు. "హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుర్రకథకు నాజర్ అలాంటివాడు" అని ముదిగొండ శివప్రసాద్ తదితర ప్రముఖుల అభిప్రాయాలు ఉంటే నాజర్ గొప్పతనం స్పష్టం అవుతున్నది. కటిక పేదరికాన్ని మరణించే వరకు అనుభవించిన నాజర్ 1997, ఫిబ్రవరి 22 న అంగలూరులో మరణించారు.

## వెస్ట్‌బ్యాంక్‌లో హింసాకాండపై యూఎన్‌ఓ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్ట్‌బ్యాంక్‌లో కొనసాగుతున్న భయంకరమై హింసాకాండపై ఐక్యరాజ్యసమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో నిశ్శబ్ధ యుద్ధం జరుగుతోందని సోమవారం హెచ్చరించింది. 2023 అక్టోబర్ నుండి వెయ్యిమందికి పైగా ప్రజలు, వారిలో మూడో వంతు మైనర్లు మరణించారని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సహాయ సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) కమిషనర్ జనరల్ ఫిలిప్పి లాజారినీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ స్థిరనివాసులు ఈప్రాంతంలో దాడులను కొనసాగిస్తున్నారని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా గాజాపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, వెస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ మానవతా చట్టం పట్ల తీవ్ర నిర్లక్ష్యం సాధారణీకరించబడిందని, మరింత తీవ్రతరం కాకముందే దీన్ని ఆపాలని ఎక్స్‌లో పేర్కొన్నారు. తూర్పు జెరూసలెంలోని తమ కార్యాలయాన్ని ఇజ్రాయిల్ సైన్యం కూల్చివేయడం, నిప్పుపెట్టడంతో పాటు అదనంగా ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్‌ను నిరోధించిందని మండిపడింది. ఆ ప్రాంతంలో తమ సేవలు కొనసాగిల్సిన అవసరం ఉందని సంస్థ ఉద్ఘాటించింది. జెరూసలెం గవర్నరేట్‌లోని అల్–ఐజరియా నగరం చుట్టూ బైపాస్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించడం .. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడి క్రమంగా పెరగాన్ని సూచిస్తుందని పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ జనవరి 28న హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ వలసవాద చర్య ప్రాదేశిక విచ్ఛిన్నతను మరింత తీవ్రతరం చేయడానికి మరియు పాలస్తీనా ప్రజలను ఒంటరిగా చేయడానికి బెదిరించే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు హెచ్చరించారు. పాలస్తీనా ప్రజలపై కొనసాగుతున్న యుద్ధం చట్రంలో ఈ విధానాలు ప్రమాదకరమైన వ్యూహాన్ని కలిగి ఉన్నాయని పాలస్తీనా నేత నబిల్ అబు రుదెనెహ్ ఖండించారు. పాలస్తీనియన్ కమ్యూనిటీలను వేరు చేయడం, వేర్వేరు మార్గాలను వినియోగించాలని వారిపై ఒత్తిడి తీసుకురావడం మరియు ప్రధాన రవాణా మార్గాలను అడ్డుకోవడం ఈ రహదారి నిర్మాణం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌తో తమిళ ప్రజలకు తీవ్ర నిరాశ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తమిళనాడు ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు గుణపాఠం తప్పక చెబుతారని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం పునరుద్ఘాటించారు. మంగళవారం తన కొలత్తూరు నియోజకవర్గంలో దాదాపు రూ 12 కోట్ల వ్యయంతో నిర్మించిన రక్త శుద్ధి విభాగంతో కూడిన బహుళ అంతస్తుల భవనాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులు బడ్జెట్‌పై అడిగిన ప్రశ్నకు స్టాలిన్ సమాధానం ఇస్తూ 'నేను ఇది వరకే చెప్పాను. కేవలం నిరాశే ఎదురైంది. ఏదైనా మార్పు ఉంటుందని మేం ఆశించాము. ఎలాంటి మార్పు లేదు. మాకు నిరాశే మిగిలింది' అని చెప్పారు. తమకు కలిగిన నిరాశకు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. అలాగే, తాను ఎవర్నీ శత్రువులుగా భావించనని, వారిని స్నేహితులుగా మాత్రమే చూస్తానని తెలిపారు. కాగా, స్టాలిన్ ప్రారంభించిన బహుళ అంతస్తుల భవనాన్ని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్మించింది. ఈ భవన మొదటి అంతస్తులో ఫిజియోథెరపీ కేంద్రం, రెండో అంతస్తులో కృత్రిమ అవయవాల కేంద్రం, మూడో అంతస్తులో డయాలసిస్ కేంద్రం, నాలో అంతస్తులో రోగుల కోసం వివిధ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కాగా, ఇదే ప్రాంగణంలో ఆరు రేషన్ దుకాణాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే, కొలత్తూరు సరస్సు సమీపంలో ఏర్పాటు చేసిన పార్కును కూడా ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులు, ఇతర లబ్ధిదారులకు పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు తదితరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కె ఆర్ పెరియకరుప్పన్, మా.సుబ్రమణియన్, పికె శేఖర్‌బాబు, చెన్నై మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, ఎ.వెట్రిఅళగన్, జోసెఫ్ శామ్యూల్, ఇతర సీనియర్ అధికారులు పాల్గన్నారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనాకు జైలు శిక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో ఆమెతో పాటు కుటుంబ సభ్యులకు జైలు శిక్ష విధించింది. రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టుకు సంబంధం ఉన్న ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి షేక్ హసీనాతో పాటు ఆమె బంధువులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢాకాలోని కోర్టు–4కు చెందిన ప్రత్యేక జడ్జి రాబిల్ ఆలమ్ ఈ కేసులో తీర్పును వెలువరించారు. షేక్ హసీనాకు ఒక్కో కేసులో ఐదేళ్ల చొప్పున మొత్తం పదేళ్ల జైలు శిక్ష విధించారు. షేక్ హసీనా మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్ధిక్, అజ్మీనా సిద్ధిక్‌లకు కూడా ఈ అవినీతి కేసుల్లో శిక్ష పడింది. ముజిబ్ సిద్ధిక్‌కు నాలుగేళ్లు, మేనకోడళ్లకు ఏడేళ్ల చొప్పున శిక్ష విధించారు. రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టు కేసులో సరెండర్ అయిన ఖుర్షీద్ ఆలమ్‌కు ఏడాది జైలు శిక్ష విధించారు. నిందితులందరికీ జరిమానా కూడా విధించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలు జీవితాన్ని అనుభవించాలని ఆదేశించారు.

## ఎలాన్ మస్క్‌కు ఫ్రాన్స్ సమన్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** చిన్నారుల అశ్లీల దృశ్యాలు, డీఫ్‌ఫేక్‌లను వ్యాప్తి చేయడం వంటి ఆరోపణలపై ఫ్రాన్స్ ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా దేశంలోని సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ ఎక్స్ కార్యాయాల్లో మంగళవారం సోదాలు నిర్వహించింది. అలాగే, విచారణ కోసం ఎక్స్ యజమాని, ప్రపంచ ధనవంతుడు ఎలాన్ మస్క్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్ 20న విచారణకు షెడ్యూల్ చేసింది. ఈ వివరాలను ఫ్రాన్స్ ప్రభుత్వం వెల్లడించింది. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో చిన్నారుల అశ్లీల చిత్రాలను పోస్టు చేయడం, వాటిని వ్యాప్తి చేయడంలో సహకరించడం, లైంగికంగా అసభ్యకరమైన డీప్‌ఫేక్‌లు.. వంటి ఇతర నేరాలపై ప్రాసిక్యూటర్ల సైబర్ క్రైమ్ విభాగం దర్యాప్తు నిర్వహిస్తుందని ఫ్రాన్స్ ప్రభుత్వం పేర్కొంది. ఎక్స్ ఉద్యోగులను కూడా విచారించడానికి సమన్లు జారీ చేసినట్లు తెలిపింది. కాగా, అయితే, ఈ సోదాలు, సమన్లపై ఎక్స్ ఇంకా స్పందించలేదు.

## ఎప్‌స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

**హైదరాబాద్ పెన్ పవర్:** లైంగిక నేరగాడిగా అపఖ్యాతి మూటగట్టుకోవడంతో పాటు అంతర్జాతీయ గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంపై విచారణ మరో మలుపు తిరిగింది. అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఓవర్‌సైట్ కమిటీ ముందు హాజరై వాంగ్మూలం ఇవ్వడానికి మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆయన భార్య హిల్లరీ క్లింటన్‌లు అంగీకరించారు. ఈ విషయాన్ని తమ న్యాయవాదుల ద్వారా కమిటీకి తెలియజేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన జేమ్స్ కోమర్ కాంగ్రెస్ హౌస్ ఓవర్‌సైట్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతకు ముందు క్లింటన్ దంపతులు వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించడంతో వారిపై ధిక్కార చర్యలు చేపడతామని కమిటీ ఛైర్మన్ హెచ్చరించారు. ధిక్కార నేరం రుజువైతే భారీ జరిమానా చెల్లించడంతో పాటు కారాగార శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది.

# బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో నూతన బస్సుల తయారీ



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో కొత్త ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేయనున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ వెల్లడించింది. వచ్చే త్రైమాసికం నుంచే వీటిని ఉత్పత్తి చేయనున్నట్లు ఎంఇఐఎల్‌కు చెందిన ఒలెక్ట్రా ఓ ప్రకటనలో పేర్కొంది. భారత ఇవి బస్ రంగంలో తొలిసారిగా ఒలెక్ట్రా అభివృద్ధి చేసిన బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కు లభించిన సర్టిఫికేషన్ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచిందని సంస్థ ఎండి మహేష్ బాబు వెల్లడించారు. ఇది సంస్థ టెక్నాలజీ ఆధారిత వృద్ధి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. శుభ్రమైన, సమర్థవంతమైన, సుస్థిర మొబిలిటీ పరిష్కారాల ద్వారా దేశంలో విద్యుత్ వాహన రంగంలో వస్తున్న మార్పులకు ఒలెక్ట్రా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఆర్థిక ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ.. బ్లేడ్ బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన బస్సుల ఉత్పత్తి ప్రణాళికను వెల్లడించారు. క్రితం క్యూ3లో 385 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివరీ చేసి సంస్థ కొత్త రికార్డును నెలకొల్పిందన్నారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే డెలివరీలు 37 శాతం పెరిగాయి. కంపెనీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.663.60 కోట్లకు చేరింది. కంపెనీ నికర లాభం రూ.46.68 కోట్లుగా నమోదయ్యింది.

# తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగాయి ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# వెనెజువెలా చమురుతో భారత్‌కు 3 బిలియన్ డాలర్లు ఆదా





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాతో ట్రేడ్ డీల్‌పై అంగీకారానికి వచ్చిన భారత్.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లకు సిద్ధమైంది. ఈ నిర్ణయంతో మన దేశానికి ఏటా దాదాపు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.27వేల కోట్లు) ఆదా కానుందట. ఈ మేరకు ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. భారత్ చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందని ఈ నివేదిక పేర్కొంది. "వెనెజువెలా చమురు బ్యారెల్‌పై 10-12 డాలర్ల వరకు డిస్కౌంట్ లభిస్తే.. ఆ చమురును ఎంచుకోవడం భారత్‌కు లాభదాయకమే. రవాణా వ్యయం, ఇతర ఖర్చులన్నీ తీసేసినా ఏటా మన దేశానికి చమురు దిగుమతుల బిల్లు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం చమురు ధరల డేటా ప్రకారం.. వెనెజువెలా ముడిచమురు బ్యారెల్ ధర దాదాపు 51 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది" అని ఎస్‌బీఐ రీసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. భారత్ తమ ముడి చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే.. ఖర్చు విషయంలో అనేక అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత వస్తుంది.. రవాణా ఖర్చులు, సమయం, బీమా వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని మన వ్యయాలను లెక్కలేసుకోవాలి. భౌగోళికపరంగా వెనెజువెలా మనకు చాలా దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి చమురు రవాణాకు పట్టే సమయం.. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. ఇక, రష్యా నుంచి వచ్చే సమయం కంటే రెట్టింపు. దీంతో వెనెజువెలా చమురుకు రవాణా వ్యయం అదనపు భారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు సుదీర్ఘకాలం లభించే అవకాశం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పడితే డిస్కౌంట్ ఆగిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వేళ వెనెజువెలా చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గుచూపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జియో బ్లాక్‌రాక్ సంపద నిర్వహణ సేవలు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ సంపద నిర్వహణ పరిశ్రమలో 20 కోట్ల మందికి సేవలు అందించే అవకాశం ఉందనే అంచనాతో, జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ 'ప్రత్యేకించిన సూచనలు అందించడానికి' ఒక టెక్ ప్లాట్‌ఫామ్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సేవల కోసం వినియోగదారులు ఏడాదికి రూ.350 ప్రారంభ ధర చెల్లించాల్సి ఉంటుంది. బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీతో నడిచే ఈ ప్లాట్‌ఫామ్, మ్యూచువల్ ఫండ్ ఎంపికలపై సలహాలు అందిస్తుంది. అంతర్జాతీయంగా 14 లక్షల కోట్ల డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తూ, మన దేశంలో జియోతో కలిసి బ్లాక్‌రాక్.. పెట్టుబడి సలహా వేదికను తీసుకొచ్చింది. ఇందులో నమోదైన వినియోగదారుల రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి లక్ష్యాలను తెలుసుకుని, వారికి సలహాలను అందించడానికి ఈ ప్లాట్‌ఫామ్ ప్రయత్నిస్తుందని కంపెనీ తెలిపింది. రోజువారీ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొంది. రూ.లక్ష విలువైన పర్యవేక్షణ ఆస్తులకు ఏడాదికి రూ.350 చెల్లించాలి. తదుపరి ఆస్తుల విలువలో 0.35% చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రారంభంలో తొలి 3 నెలలు ప్లాట్‌ఫామ్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ మార్క్ పిల్గ్రెమ్ వెల్లడించారు.

# గూగుల్ కీలక నిర్ణయం.. బెంగళూరులో భారీ క్యాంపస్

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వర్క్ వీసాల హెచ్1బి నిబంధనలను మరింత కఠినతరం చేసిన విషయం తెలిసిందే. కొత్తగా హెచ్1బి వీసా తీసుకోవాలనుకునే ఉద్యోగులు, కంపెనీలు అక్షరాలా లక్ష డాలర్లు చెల్లించాల్సిందే. దీంతో విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం అక్కడి కంపెనీలకు కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజమైన తన భవిష్యత్ వర్క్ ఫోర్స్ ను ఎక్కడ విస్తరించాలన్నదానిపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వీసాల కోసం ఎదురుచూడకుండా.. భారత్ పై మరింత పెట్టుబడి పెట్టేందుకు గూగుల్ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 20 వేల మందికి పైగా ఉద్యోగులకు ఆ కంపెనీలో పనిచేసే అవకాశం లభిస్తుందని బ్లూమ్ బర్గ్ నివేదిక వెల్లడించింది. వైట్ ఫీల్డ్ లోని అలెంబిక్ సిటీ ఈ ప్రాజెక్టుకు కేంద్రంగా నిలవనుంది. బెంగళూరులో ఉన్న ప్రధాన ఐటీ కారిడార్లలో ఇది కూడా ఒకటి. గూగుల్ మాతృసంస్థ అయిన అల్ఫాబెట్ ఇప్పటికే అక్కడ ఒక ఆఫీస్ ను లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్లకు ఆప్షన్లు పొందింది. సుమారు 24 లక్షల చదరపు అడుగుల్లో మూడు టవర్లు ఉన్నాయి. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం.. 6.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టవర్.. కొద్ది నెలల్లోనే సంస్థ ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. మిగతా రెండు టవర్ల నిర్మాణం ఏడాది కాలంలో పూర్తయ్యే అవకాశం ఉంది. వీటిలో అల్ఫాబెట్ అధికారికంగా ఒక టవర్ కు సంబంధించిన లీజు గురించి మాత్రమే వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 14 వేల మంది గూగుల్ ఉద్యోగులు ఉండగా.. వైట్ ఫీల్డ్ క్యాంపస్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే.. గూగుల్ ఇండియా



వర్క్ ఫోర్స్ మరింత రెట్టింపు కానుంది. దీనివల్ల గ్లోబల్ కార్యకలాపాల్లో భారత్ కు మరింత ప్రాధాన్యం పెరగుతుందని నిపుణులు చెప్తున్నారు. గత ఏడాది బెంగళూరులో గూగుల్ అతిపెద్ద క్యాంపస్‌ను ప్రారంభించింది. ఇందులో వినోద సదుపాయాలు, భారీ క్యాంటీన్లు ఉన్నాయి. అప్పటి నుంచి నియామకాలు వేగంగా జరుగుతున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ లీడర్‌షిప్, మెషిన్ లెర్నింగ్, చిప్ డిజైన్, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ వంటి విభాగాల్లో వందలాది ఉద్యోగాల కోసం గూగుల్ ప్రకటనలు జారీ చేసింది. కొన్ని పోస్టులకు పీహెచ్‌డీ అర్హతలు కూడా నిర్దేశించింది. యూట్యూబ్ కూడా జనరేటివ్ ఏఐ టూల్స్ అభివృద్ధి కోసం భారత్‌లో తన ఇంజినీరింగ్ టీమ్‌ను విస్తరిస్తోంది.

# ఇండియా-యూఎస్ డీల్ పై లోక్‌సభలో కేంద్రం ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై కేంద్రం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. ఇవాళ లోక్ సభలో మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంతో భారత్ సేఫ్ అని స్పష్టం చేశారు. మన రైతులకు ఈ డీల్ రక్షణ ఇస్తుందన్నారు. మోడీ-ట్రంప్ రెగ్యులర్ టచ్ లోనే ఉన్నారని తెలిపారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదన్నారు. ఈ ఒప్పందంతో భారతీయ ఎగుమతులకు లాభం చేకూరనుందని ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. అయితే భారత్-యూఎస్ ట్రేడ్ డీల్ పై పీయూష్ గోయల్ ప్రసంగం సమయంలో లోక్ సభలో గందరగోళం ఏర్పడింది. ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళన మధ్యే గోయల్ తన ప్రసంగాన్ని కంటిన్యూ చేశారు. ఈ క్రమంలో విపక్ష సభ్యుల తీరుపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపే విధానం ఇదేనా సీనియర్లు, గతంలో ప్రభుత్వాన్ని నడిపిన వారు వ్యవహరించే తీరు ఇదేనా అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో విపక్ష సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో సభను ఈరోజు మధ్యహానం 2 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. కాగా భారత్ తో వాణిజ్య ఒప్పందానికి అగీకరిస్తున్నామని యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మొన్న ప్రకటించిన సంగతి తెలిసిందే. మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు భారత్ అంగీకరించిందని మోడీ నాకు గొప్ప స్నేహితుడు అని ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్ లో పోస్టు చేశారు. ఈ డీల్ తో 25 శాతం అదనపు సుంకాలు భారత్ పై ఉండబోవని యూఎస్ స్పష్టం చేసింది. ఇకపై సుంకాలు 18 శాతానికి తగ్గుతాయని తెలిపింది. ట్రంప్ ప్రకటను భారత ప్రభుత్వం సైతం ధృవీకరించగా ఇవాళ పార్లమెంట్ లో అధికారికంగా ప్రకటించింది.


# కళారంగ ఘనాపాఠి గరికపాటి

**హైదరాబాద్ పెన్ పవర్:** కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్ఫూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కరదీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు రాజారావు. నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక సైనికుడిలా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే. గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963) తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభా వంతమైన కళాకారులు పరిచమయ్యారు. చెప్పికోదగిన వారిలో దేవిక, అల్లు రామలింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు. రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామలింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువు కుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకంలోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరా బాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు. మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. మద్రాసలో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎస్‌వీఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ నటుడు రూపశిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి బాగుబాగు, గాలి బాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు. వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తనే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవారు. కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాల నిర్వహించారు. రాజారావు 1953లో పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్యం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశారు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించ లేదు.

దానితో రాజరావు ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. ఒక్క రూపాయికి వైద్యం చేసిన సేవా తత్పరులు. పేదవారికి ఉచితం వైద్యం చేస్తుండేవారు. ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నాచితక పాత్రలు కూడా పోషించారు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశారు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాలవల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.

# రాత్రి లైట్ వేసుకుని పడుకుంటున్నారా?

మీకు రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోయే అలవాటు ఉందా? చీకటి అంటే భయంతోనో లేదా అజాగ్రత్తతోనో లైట్లు ఆర్పకుండా పడుకుంటున్నారా? అయితే మీరు ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నట్లే.. రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల కేవలం నిద్రలేమి మాత్రమే కాదు.. ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్లు కూడా వచ్చే ముప్పు ఉందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. రోజంతా కష్టపడి పనిచేశాక.. హాయిగా నిద్రపోతేనే కదా రేపటి పనులకు శరీరం సిద్ధమయ్యేది.. కానీ చాలామంది రాత్రిపూట లైట్లు వెలిగించి నిద్రపోతుంటారు. చీకటి అంటే భయంతోనో లేదా భద్రతా కారణాలతోనో ఈ అలవాటును కొనసాగిస్తుంటారు. అయితే ఈ చిన్న అలవాటు మీ ప్రాణాల మీదకు తెస్తుందని మీకు తెలుసా..? రాత్రిపూట వెలుతురులో నిద్రపోవడం వల్ల ఊబకాయం నుంచి క్యాన్సర్ వరకు అనేక ముప్పులు ఉన్నాయని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మంచి నిద్ర కేవలం విశ్రాంతి మాత్రమే కాదు.. అది ఆరోగ్యానికి పునాది. మనం నిద్రపోతున్నప్పుడే మన శరీరం, మనస్సు దెబ్బతిన్న కణాలను సరిచేసుకుంటాయి. సరిగ్గా నిద్ర లేకపోతే చిరాకు, మానసిక ఒత్తిడి కలగడమే కాకుండా.. దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆందోళన వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మన శరీరంలో సిర్కాడియన్ రిథమ్ అనే ఒక సహజ గడియారం ఉంటుంది. చీకటి పడగానే మన శరీరం మెలటోనిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది మనల్ని గాఢ నిద్రలోకి తీసుకెళ్తుంది. కానీ రాత్రిపూట ప్రకాశవంతమైన వైట్ లైట్లు లేదా మొబైల్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల ఈ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా నిద్ర నాణ్యత తగ్గి, హార్మోన్ల అసమతుల్యత



ఏర్పడుతుంది. వెలుతురులో నిద్రించడం వల్ల శరీర మెటబాలిజం తగ్గి బరువు పెరుగుతారు. మాటిమాటికీ మేల్కొలుపు రావడం వల్ల నిద్రలేమి సమస్య వేధిస్తుంది. మెలటోనిన్ స్థాయిలు తగ్గడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఒకవేళ చీకటిలో నిద్రపోలేకపోతే.. మృదువైన పసుపు లేదా ఆరెంజ్ రంగు లైట్లను వాడండి. ఇవి నిద్రపై తక్కువ ప్రభావాన్ని చూపుతాయి. నేటి వేగవంతమైన జీవితంలో నిద్రను నిర్లక్ష్యం చేయకండి. రాత్రిపూట లైట్లు ఆర్పడం అనే ఒక చిన్న మార్పు మీ ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుంది.

# అరటిపండ్లు, ఖర్జూరం తక్షణ శక్తి కోసం ఏది తినాలి?

అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరిలో అలసట, బలహీనత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రారంభమైతే.. మళ్లీ రాత్రి నిద్రపోయే వరకు ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నప్పటికీ అటువంటి సమస్యల నుంచి బయటపడటానికి సులభమైన మార్గాన్ని నిపుణులు చెబుతున్నారు. అదేంటంటే.. ఈ అలసటను వదిలించుకోవడానికి వ్యాయామం, త్వరగా శక్తిని పొందడానికి చాలా మంది అరటిపండ్లు లేదా ఖర్జూరాలు తీసుకుంటూ ఉంటారు. కానీ వీటిలో ఏది ఉత్తమమో, ఏ సమయంలో ఏది తినాలో తప్పక తెలుసుకోవాలి. తద్వారా మీరు రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. ఒక అరటిపండులో దాదాపు 105 కేలరీలు ఉంటాయి. ఇందులో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. అరటిపండ్లతో పోలిస్తే, ఖర్జూరం కేలరీలు ఎక్కువగా ఉంటాయి. కేవలం మూడు లేదా నాలుగు ఖర్జూరాలు తినడం వల్ల మీకు 90 నుంచి 120 కేలరీల శక్తి లభిస్తుంది. అంతే కాదు వాటిలో ఫైబర్, ఐరన్, మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటాయి. ఎక్కువసేపు వ్యాయామం



చేయాలనుకునేవారికి లేదా రోజంతా ఉత్సాహంగా పనిచేయాలనుకునే వారికి, అరటిపండ్లు మంచివి. వాటిలోని ఫైబర్ చక్కెరను నెమ్మదిగా రక్తంలోకి విడుదల చేస్తుంది. తద్వారా ఎక్కువ సమయం శక్తిని అందించడానికి సహాయపడుతుంది. వ్యాయామం తర్వాత అలసిపోయినా లేదా నీరసంగా అనిపించినా తక్షణ శక్తి కోసం ఖర్జూరం తినడం మంచిది. ఎందుకంటే వాటిలో అధిక మొత్తంలో సహజ చక్కెర ఉంటుంది. శరీరానికి వెంటనే గ్లూకోజ్‌ను అందిస్తుంది. అందుకే ఉపవాసం ఉన్నవారు ఖర్జూరాన్ని తినేందుకు ఇష్టపడతారు. కానీ డయాబెటిస్ ఉన్నవారు వీలైనంత వరకు ఖర్జూర వినియోగాన్ని నియంత్రించుకోవాలి. కండరాల తిమ్మిరితో బాధపడేవారు కూడా ఖర్జూరం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కండరాలు త్వరగా కోలుకోవడానికి సహాయపడుతుంది.

# గుండె సమస్యల్ని దూరం చేసే స్ట్రాబెర్రీస్



మనం రోజూ తీసుకునే పసుపు, మిరియాలు, ఆకుకూరలు, క్యారెట్స్, నెయ్యి, అరటిపండ్లు, పల్లీలు ఇవన్నీ కూడా మన అనారోగ్య సమస్యల్ని దూరం చేసి ఆరోగ్యాన్ని కాపాడేవే. అందుకోసమే, కచ్చితంగా వీటిని తీసుకోవాలి. అయితే, తీసుకున్నంత మాత్రాన అవి సరైన విధమైన రిజల్ట్ చూపిస్తుందని లేదు. ఎందుకంటే, అవి హెల్దీ ఫుడ్స్ అయినప్పటికీ వాటిని సరైన విధంగా తీసుకుంటేనే మనం అనుకున్న ఫలితాలని అందిస్తుంది. అందుకోసం ఏయే ఫుడ్స్‌ని ఎలా తీసుకోవాలో హెల్త్ కోచ్ మిరుణ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేస్తున్నారు. పసుపు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలతో పాటు మరెన్నో పోషకాలు ఉంటాయి. అందుకే, దీనిని మన వంటల్లోనూ భాగం చేయడమే కాకుండా ఆయుర్వేదంలోనూ వాడుతుంటారు. అయితే, ఈ పసుపులోని గుణాలన్నింటిని అందుకోవాలంటే మాత్రం పసుపుని నల్ల మిరియాల పొడితో కలిపి తీసుకోవాలి. దీంతో పసుపులోని కర్కుమిన్ అనేది మన శరీరానికి చక్కగా అందుతుంది. ఇది పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా పనిచేసి జాయింట్ పెయిన్స్, కీళ్ళ నొప్పుల వంటివన్నీ దూరమవుతాయి. కాబట్టి, పసుపుని మనం తీసుకున్నప్పుడు అందులో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తీసుకోండి. ఇలా తీసుకుంటే దాని పనితీరు 2వేల శాతం పెరుగుతుందట. దీని వల్ల బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి నొప్పులు చాలా వరకూ దూరమవుతాయి. క్యారెట్స్ తింటే కళ్ళకి మంచిది. ఇంకా ఎన్నో లాభాలు. అయితే, వీటిని మనం హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండి తీసుకున్నప్పుడే ఆ బెనిఫిట్స్ మనకి లభిస్తాయి. అందుకోసం క్యారెట్స్‌ని మనం ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనె, నెయ్యి వంటి హెల్దీ ఫ్యాట్స్‌తో కలిపి వండడం మంచిది. దీంతో క్యారెట్స్‌లోని బీటా కెరోటిన్ బాడీకి అందుతుంది. దీంతో కంటి చూపుకి హెల్ప్ అవ్వడమే కాకుండా చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుంది. అరటిపండ్లు, పల్లీలు రెండూ మంచివే. అయితే, వీటిని విడివిడిగా తీసుకునే బదులు కలిపి తీసుకుంటే మంచిది. వీటి కాంబినేషన్ మంచి ప్రోటీన్ రిచ్‌గా మారుతుంది. ఎవరైతే బరువు పెరగాలనుకుంటారో అలాంటి వారు ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది. అంతేకాకుండా, మజిల్స్ కూడా బాగా పెరుగుతాయి. అదే విధంగా, విటమిన్ సి కోసం ఉసిరిని మన డైట్‌లో యాడ్ చేస్తుంటారు. వీటిని నేరుగా అలానే తీసుకోవడం కంటే తేనెతో కలిపి తీసుకోవాలి. దీంతోపాటు, కొద్దిగా మిరియాల పొడి కలిపి చూడండి. అప్పుడు ఇది సూపర్‌ఫుడ్‌గా మారి బ్రెయిన్ ఫోకస్ పెరిగేలా చేస్తుంది. జ్ఞాపకశక్తిని కూడా పెంచుతుంది. స్ట్రాబెర్రీస్ తీసుకోవడం వల్ల మన బాడీకి యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా అందుతాయి. అయితే, వాటిని నేరుగా తీసుకోవడం కంటే డార్క్ చాక్లెట్‌తో కలిపి తీసుకోవడం మంచిది. దీంతో మనకి యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ అంది బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. దీంతో గుండె పనితీరు మెరుగ్గా మారుతుంది. కాబట్టి, ఎప్పుడైనా సరే డార్క్ చాక్లెట్‌ని స్ట్రాబెర్రీస్‌తో కలిపి తీసుకోండి. ఆపిల్స్ తీసుకుంటే డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదంటారు. అయితే, అలా ఆపిల్స్‌ని ఊరికే తీసుకోకుండా వాటిపై కొద్దిగా దాల్చినచెక్కపొడి కలిపి తీసుకోండి. దీంతో ఇన్సులిన్ లెవల్స్ మెరుగ్గా మారతాయి. ఎవరైతే షుగర్‌తో బాధపడుతున్నారో వారికి ఈ టిప్ చాలా బాగా హెల్ప్ అవుతుంది. బెస్ట్ కాంబినేషన్‌లా పనిచేసి షుగర్‌ని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తుంది.

# షుగర్ ఉన్నవాళ్లు పెరుగుతింటే ఏమవుతుంది?



పెరుగు మన జీర్ణవ్యవస్థకు ఒక వరం లాంటిది. రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఎముకల బలానికి కూడా ఇది ఎంతో తోడ్పడుతుంది. కానీ మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగు తినడం సురక్షితమేనా అనే ప్రశ్న చాలామందిని వేధిస్తుంటుంది. పెరుగు ఇన్సులిన్ సెన్సిటివిటీని ఎలా మెరుగుపరుస్తుంది? ప్యాక్ చేసిన పెరుగు ఆరోగ్యకరమేనా? భారతీయుల భోజనంలో పెరుగు లేనిదే ముద్ద దిగదు. జీర్ణక్రియకు, ఎముకల బలానికి, రోగనిరోధక శక్తికి పెరుగు ఒక దివ్యౌషధం. అయితే, పెరుగు తినడం గురించి మనలో చాలామందికి కొన్ని భయాలు, సందేహాలు ఉన్నాయి. రాత్రి పూట తినకూడదని కొందరు, జలుబు చేస్తుందని మరికొందరు అంటుంటారు. ఈ అపోహలపై మహారాష్ట్రకు చెందిన హోమియోపతి నిపుణుడు సాయాజీరావు గైక్వాడ్ క్లారిటీ ఇచ్చారు. చాలామంది పెరుగు తింటే జలుబు చేస్తుందని భయపడతారు. అయితే దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని డాక్టర్ గైక్వాడ్ స్పష్టం చేశారు. పెరుగు తిన్న తర్వాత ఎవరికైనా అసౌకర్యంగా అనిపిస్తే, అది వారి శరీర తత్వాన్ని బట్టి ఉంటుందే తప్ప అందరికీ వర్తించదు. మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగుకు దూరంగా ఉండక్కర్లేదు. తియ్యని పెరుగులో గ్లైసెమిక్ లోడ్ తక్కువగా ఉంటుంది. పెరుగు శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. భోజనంతో పాటు తక్కువ మొత్తంలో పెరుగు తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. రాత్రి పూట పెరుగు అస్సలు తినకూడదనే కఠినమైన నియమం ఏమీ లేదు. మంచి జీర్ణశక్తి ఉన్నవారు రాత్రి భోజనంలో పెరుగును నిరభ్యంతరంగా చేర్చుకోవచ్చు. అయితే మరీ భారీగా ఉండే ఆహారాలు లేదా వేయించిన వంటకాలతో కలిపి తీసుకుంటే కొందరికి అసౌకర్యం కలగవచ్చు. మార్కెట్లో దొరికే అన్ని ప్యాక్డ్ పెరుగుల్లో ప్రోబయోటిక్స్ ఉండవు. మీరు ప్యాక్డ్ పెరుగు కొనేటప్పుడు దాని లేబుల్ మీద ప్రోబయోటిక్ అని ఉందో లేదో కచ్చితంగా తనిఖీ చేయాలి. వీలైనంత వరకు ఇంట్లో తోడు పెట్టుకున్న తాజా పెరుగు వాడటమే శ్రేయస్కరం.

# ఈ సూపర్ ఫుడ్ తింటే 30 రోజుల్లోనే అద్భుతాలు..



నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో మనకు సంపాదనపై ఉన్న శ్రద్ధ ఆరోగ్యంపై ఉండటం లేదు. సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం, మితిమీరిన పని ఒత్తిడి, మానసిక ఆందోళనల వల్ల చాలామంది తెలియకుండానే శారీరకంగా బలహీనపడిపోతున్నారు. అయితే బరువు పెరగడం కోసం మందులు లేదా పౌడర్ల జోలికి వెళ్లడం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపిస్తాయి. నేటి ఆధునిక కాలంలో బరువు తగ్గడానికి ఎన్ని చిట్కాలు ఉన్నాయో, సరైన బరువు లేక ఇబ్బంది పడే వారి సంఖ్య కూడా అంతే ఉంది. బిజీ జీవనశైలి, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, మానసిక ఒత్తిడి వల్ల చాలామంది తక్కువ బరువు, నీరసంతో బాధపడుతున్నారు. కోల్పోయిన ఆరోగ్యాన్ని తిరిగి పొందడానికి మార్కెట్లో దొరికే కెమికల్ మందుల కంటే, మన ఆయుర్వేదంలో చెప్పబడిన సహజ పద్ధతులు ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.ఆరోగ్యకరమైన రీతిలో బరువు పెరగాలనుకునే వారికి ఎండిన ఖర్జూరం ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా కేలరీల సమతుల్యతను కాపాడతాయి.ఖర్జూరంలో కేవలం శక్తి మాత్రమే కాదు శరీరానికి అవసరమైన ఎన్నో ఖనిజాలు ఉన్నాయి. కాల్షియం ఎముకల దృఢత్వానికి తోడ్పడుతుంది. ఐరన్ రక్తహీనతను తగ్గించి, రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుతుంది. పొటాషియం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఫైబర్ జీర్ణక్రియను సాఫీగా ఉంచి, మనం తినే ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించేలా చేస్తుంది. కండరాల నిర్మాణానికి, ఆరోగ్యకరమైన కొవ్వును పెంచడానికి ఖర్జూరాన్ని పాలతో కలిపి తీసుకోవడం అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. కొన్ని ఎండిన ఖర్జూరాలను రాత్రంతా పాలలో నానబెట్టండి. మరుసటి రోజు ఉదయం ఆ ఖర్జూరాలను తిని, ఆ పాలను తాగడం వల్ల శరీరం చల్లబడటమే కాకుండా లోపల నుండి బలం చేకూరుతుంది. రసాయనాలతో కూడిన పౌడర్లు, మందుల జోలికి వెళ్లకుండా ఇలాంటి సహజసిద్ధమైన ఆహారంతో మీ బరువును, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి.

## సడెన్‌గా కాఫీ తాగడం మానేస్తే.. శరీరంలో జరిగే మార్పులు

ప్రస్తుత రోజుల్లో పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది కాఫీ, టీ వంటి పానియాలను తాగుతూ ఉంటారు. ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో ఇవి ఒక భాగమైపోయాయి. అయితే కాఫీలో కెఫిన్ ఉంటుంది. దీన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. చాలా మంది మధ్య తరగతి వారికి టీ, కాఫీ అనేది కేవలం ఒక పానియం మాత్రమే కాదు.. ఇదొక ఎమోషన్. అలానే వారి డే మొత్తాన్ని సరిగ్గా నడిపించే ఇందనం. వీటిని మితంగా తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం మన ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది టీ, కాఫీ లాంటి అలవాట్లను తగ్గించుకోవాలని చూస్తున్నారు. కానీ సడెన్‌గా ఈ అలవాటును మానుకోవడం వల్ల వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది వెనక్కి తగ్గుతారు. ఫేమస్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ అర్చన బాత్రా ప్రకారం.. ఒకేసారి కాఫీ మానేయడం వల్ల మంచి జరగడం కంటే చెడే ఎక్కువ జరుగుతుందని అంటున్నారు. కెఫిన్ మన నాడీ వ్యవస్థకు ప్రోత్సహించడంతో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి అకస్మాత్తుగా దానిని ఆపడం వల్ల మెదడుకు రక్త ప్రవాహంలో మార్పులు వస్తాయి. దీని వల్ల మనం అనేక రకాల సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని చెబుతున్నారు. తీవ్రమైన తలనొప్పి: శరీరానికి తగినంత కెఫిన్ లభించనప్పుడు రక్త నాళాలు వ్యాకోచించడం జరుగుతుంది.. తర్వాత తలనొప్పి రావడం జరుగుతుంది. అలసట, నిద్రలేమి: సడెన్‌గా కాఫీ మానేడం వల్ల శరీరంలో కేఫిన్ పరిమాణం తగ్గి శరీరం దాని సహజ శక్తిని కనుగొనడంలో ఇబ్బంది పడుతుంటుంది. దీని వల్ల నిద్రలేమి సమస్యలు, ఎప్పుడూ అలసటగా అనిపించడం జరుగుతుంది. మానసిక స్థితి మార్పులు: సడెన్‌గా కాఫీ మానేయడం వల్ల మీరు మానసికంగా సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది. అంటే అనవసరైమన ఆందోళన, ఏకాగ్రత కోల్పోవడం.. దేనిపై సరిగ్గా దృష్టిపెట్టలేకపోవచ్చు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు మీరు రోజుకు నాలుగు కప్పుల కాఫీ తాగితే, దాన్ని సడెన్‌గా తగ్గించకుండా.. మెల్లమెల్లగా తగ్గిస్తూ రండి. అంటే మొదటి వారంలో మూడు, రెండో వారంలో రెండు, చివరకు ఒకటి ఇలా నెమ్మదిగా కాఫీని తగ్గించండి. ఇలా చేసే సందర్భంగా మీ శరీరంలో కెఫిన్ శాతం తగ్గుతుంది. కాబట్టి మీరు శరీరాన్ని హైడ్రెడ్‌గా ఉంచడం చాలా ముఖ్యం. ఇందుకోసం మీరు పుష్కలంగా నీరు తాగడం అలవాటు చేసుకోండి. కాఫీకి బదులుగా, మీరు తక్కువ కెఫిన్ కంటెంట్ ఉన్న గ్రీన్ టీ లేదా హెర్బల్ టీని అలావాటు చేసుకోండి. ఇలా మీరు క్రమం తప్పకుండా వీటిని పాటిస్తే.. ఎలాంటి సమస్యలు లేకుండా కాఫీని మానేవచ్చు.

# ఒక్క పటిష్ట జట్టు కూడా లేదు: వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాకు ఇంత ఈజీ డ్రానా



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ లాంటి మెగా ఈవెంట్ అనగానే ఆస్ట్రేలియాకు ఎక్కడ లేని పూనకం వస్తుంది. ద్వైపాక్షిక సిరీస్ లు ఎలా ఆడినా వరల్డ్ లో తమలోని మరో కోణాన్ని చూపిస్తారు. ఐసీసీ ట్రోఫీలంటే ఈజీగా గెలిచే ఆస్ట్రేలియా మరో ట్రోఫీపై కన్నేసింది. ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ కు రంగం సిద్ధమైంది. మరో మూడు రోజుల్లో ఈ టోర్నీ గ్రాండ్ గా ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీలో ఆతిధ్య జట్టు ఇండియాతో పాటు ఆస్ట్రేలియా కూడా టైటిల్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. షెడ్యూల్ ప్రకారం ఆస్ట్రేలియా తమ గ్రూప్ మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలో ఆడాల్సి ఉంది. దీంతో ఇప్పటికే ఆసీస్ జట్టు కొలంబోకు చేరుకుంది. ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో వరల్డ్ కప్ పోరును ఆస్ట్రేలియా స్టార్ట్ చేయనుంది. ఫిబ్రవరి 13న జింబాబ్వే, ఫిబ్రవరి 16న శ్రీలంక, ఫిబ్రవరి 20న ఒమన్‌తో తలపడనుంది. ఇక్కడ ఒక విషయం గమనిస్తే ఆస్ట్రేలియా ఉన్న గ్రూప్-బి లో అన్ని చిన్న జట్లే ఉన్నాయి. ప్రతి గ్రూప్ లో రెండు పెద్ద జట్లు ఉన్నప్పటికి గ్రూప్-బి లో మాత్రం ఆస్ట్రేలియాకు తిరుగులేకుండా పోయింది. జింబాబ్వే, ఒమన్,ఐర్లాండ్ జట్లు ఆసీస్ కు కనీస పోటీ ఇచ్చే దశలో లేవు. శ్రీలంక కూడా ఇటీవలే ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ ఓడిపోయి ఢీలా పడింది. స్థాయికి తగ్గట్టుగా ఆడితే గ్రూప్ 'బి' లో ఆస్ట్రేలియా ఈజీగా నాలుగు మ్యాచ్ లు గెలిచి అలవోకగా సూపర్-8 బెర్త్ కన్ఫర్మ్ చేసుకునేలా ఉంది. అసలే ఐసీసీ టోర్నీలంటే చెలరేగి ఆడే ఆస్ట్రేలియాకు తమ గ్రూప్ లో చిన్న జట్లు వేయడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఈ గ్రూప్ పై క్రికెట్ ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. ఇటీవలే శ్రీలంకలో ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ తమ జట్టు టీ20 వరల్డ్ కప్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. స్టార్ ఆటగాళ్లు స్టార్క్, కమ్మిన్స్ అందుబాటులో లేకపోయినా ఆస్ట్రేలియా జట్టు అత్యంత పటిష్టంగా కనిపిస్తుంది. 2026, ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా శనివారం (జనవరి 31) తమ తుది జట్టును ప్రకటించింది. 15 మంది పేర్లతో కూడిన టీమ్‌ను అనౌన్స్ చేసింది. ఈ మెగా టోర్నమెంట్ కోసం ఆసీస్ ఇప్పటికే తమ తాత్కాలిక జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. వివిధ కారణాలతో తాత్కాలిక జట్టులో పలు మార్పులు చేస్తూ శనివారం తుది జట్టును ప్రకటించింది.

ఈ టీమ్‌లో ప్రధానంగా రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. వెన్ను గాయం కారణంగా పాట్ కమ్మిన్స్ మెగా టోర్నీకి దూరం కాగా అతడి స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను ఎంపిక చేసింది. ఇక, తాత్కాలిక జట్టులో ఉన్న మాట్ షార్ట్‌ను తప్పించి అతని స్థానంలో మాట్ రెన్షాను జట్టులోకి తీసుకుంది. సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

**2026 టీ20 వరల్డ్ కప్ కు ఆస్ట్రేలియా స్క్వాడ్:**
మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, గ్లెన్ మాక్స్‌వెల్, మాథ్యూ రెన్షా, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

# నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది: రవిచంద్రన్ అశ్విన్



- మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఉందన్న రవిచంద్రన్ అశ్విన్
- మ్యాచ్ జరగకుంటే పాకిస్థాన్ భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక
- ఇరుజట్ల మధ్య తటస్థ వేదికల్లో మ్యాచ్‌లు కాబట్టి వేదిక సమస్య కాదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగితే చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. టీ20 ప్రపంచకప్ 2026 ముంగిట పాకిస్థాన్ వివాదం వేళ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్, పాకిస్థాన్ మధ్య వంద శాతం మ్యాచ్ జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు. నాలుగైదు రోజుల్లో దాయాది దేశం దారికి వస్తుందని అభిప్రాయపడ్డాడు.వంద శాతం ఇరుదేశాల మధ్య మ్యాచ్ జరుగుతుందని ఆయన అన్నాడు. ఒకవేళ పాకిస్థాన్, భారత్ మధ్య మ్యాచ్ జరగకుంటే ఆ దేశం భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించాడు. బ్రాడ్‌కాస్టర్లు కూడా పెద్ద మొత్తంలో నష్టపోతారని, ఆ ప్రభావం అన్ని దేశాల క్రికెట్ బోర్డులపై పడుతుందని అన్నాడు. ఐసీసీ సమావేశంలోనూ ఈ అంశం చర్చకు వస్తుందని పేర్కొన్నాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు రావని చెప్పాడు.భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో పోటీ పడుతున్నాయని, కాబట్టి ఇక్కడ ఇరుదేశాల మధ్య మ్యాచ్‌లకు వేదిక అనేది కారణం కాదని పేర్కొన్నాడు. ఒక ప్రత్యర్థితో ఆడనని చెప్పడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నాడు. పాకిస్థాన్‌కు ఆ దేశమే శత్రువని, ఇందుకు వారి మైండ్ సెట్ కారణమని అన్నాడు. కాగా, ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచ కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. అయితే బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది.

# టీ20 వరల్డ్ కప్ పై ధోనీ ఏమన్నారంటే..!

- ఈసారి అన్నీ ప్రమాదకరమైన జట్లే ఆడుతున్నాయన్న ధోనీ
- టీమ్ ఇండియా మరింత ప్రమాదకరమైన జట్టని వ్యాఖ్య
- పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న ఈ పొట్టి ప్రపంచకప్ విజేతగా నిలవబోయే జట్టు ఏదనే దానిపై మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ధోనీ మాట్లాడుతూ భారత జట్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి టీ20 వరల్డ్ కప్ లో పాల్గొంటున్న జట్లన్నీ ప్రమాదకరమైనవేనని చెప్పారు.అయితే, అన్ని జట్లలోకి భారత్ మరింత ప్రమాదకరమైన జట్టు అని, మన కుర్రాళ్లు అద్భుతమైన ఫామ్ లో ఉన్నారని చెప్పారు. పొట్టి ఫార్మాట్ లో ఆటగాళ్లపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, భారత జట్టులోని ఆటగాళ్లు అందరికీ ఒత్తిడిలో ఆడిన అనుభవం పుష్కలంగా ఉందని అన్నారు. ఎవరు ఏ పాత్ర పోషించాలో జట్టులోని సభ్యులకు స్పష్టంగా తెలుసని ధోనీ చెప్పారు. మంచి జట్టుకు ఉండాల్సిన లక్షణాలన్నీ టీమ్ ఇండియాలో ఉన్నాయని వివరించారు.

**అదే భయపెడుతోంది..**
మ్యాచ్ జరిగే వేదికల్లో వాతావరణం తనను కలవరపరుస్తోందని ధోనీ చెప్పారు. శీతాకాలం కావడంతో కొన్ని నగరాల్లో మంచు కురుస్తోందని, మ్యాచ్ పై దీని ప్రభావం చాలా ఉంటుందని వివరించారు. ఇది చాలా విషయాలను ప్రభావితం చేస్తుందని, తాను ఆడుతున్న సమయంలోనూ డ్యూ (మంచు) అంటే భయాందోళనలకు గురయ్యానని చెప్పారు. ఇలాంటి సమయంలో టాస్ కీలక పాత్ర పోషిస్తుందని ధోని చెప్పుకొచ్చారు.



సాక్షి మాలిక్ యొక్క ఎఫర్ట్‌లెస్ జనవరి గ్లో

# నాని 'డబుల్' దూకుడు.. జోష్ కొనసాగించడం పక్కానా?



నేచురల్ స్టార్ నాని అంటే టాలీవుడ్ ప్రేక్షకులకు ముందుగా గుర్తుకొచ్చేది సహజమైన నటన, కథలకు ప్రాధాన్యత ఇచ్చే సెలెక్షన్. కెరీర్ ప్రారంభం నుంచే బాయ్ నెక్స్ట్ డోర్ ఇమేజ్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న నాని, ఇప్పుడు స్టార్ హీరోగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ తనదైన ముద్ర వేస్తున్నారు. హీరోగా వరుస విజయాలు సాధిస్తున్న ఆ స్టార్, నిర్మాతగా కూడా అదే జోష్ కొనసాగిస్తారా అన్న ఆసక్తి ఇండస్ట్రీలో పెరుగుతోంది. దసరాతో మాస్ అవతార్ లో అదరగొట్టిన నాని, హాయ్ నాన్నతో ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ప్రేక్షకులను కట్టిపడేశారు. ఆ తర్వాత కూడా వరుస హిట్స్ అందుకున్నారు. భిన్నమైన కథలను ఎంచుకుంటూ హిట్స్ అందుకోవడం ఆయన ప్రత్యేకత. ఇప్పుడు ది ప్యారడైజ్ వంటి భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్ట్ తో మరోసారి కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు.హీరోగా ఆయన కెరీర్ స్పీడ్ చూస్తుంటేడ మరో లెవల్ కు వెళ్లేలా కనిపిస్తోంది. ఇదే సమయంలో నిర్మాతగా కూడా నాని తీసుకుంటున్న నిర్ణయాలు ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ పై కంటెంట్ బేస్డ్ సినిమాలను నిర్మిస్తూ కొత్త దర్శకులు, కొత్త కథలకు వేదిక కల్పిస్తున్నారు నాని. ఇప్పటికే హిట్ ఫ్రాంచైజ్ తో థ్రిల్లర్ జానర్ లో మంచి బ్రాండ్ క్రియేట్ చేశారు. ప్రతి పార్ట్ ప్రేక్షకులను థ్రిల్ చేస్తూ కమర్షియల్ సక్సెస్ సాధించింది. అలాగే చిన్న సినిమాగా వచ్చిన కోర్ట్ అనూహ్యంగా బాక్సాఫీస్ వద్ద లాభాలు తెచ్చిపెట్టింది. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ చిత్రం 2025లో అత్యధిక లాభాలు సాధించిన చిన్న చిత్రాల్లో ఒకటిగా నిలవడం విశేషం. దీంతో నిర్మాతగా నాని కథలపై పెట్టే నమ్మకం, ప్లానింగ్ ఎంత పక్కాగా ఉందో మరోసారి రుజువైంది. 2026లో నిర్మాతగా నాని నుంచి ఎలాంటి సినిమాలు లేకపోయినాడ 2027 కోసం మాత్రం భారీ ప్లాన్ రెడీ చేస్తున్నారట.ఒకేసారి మూడు ప్రాజెక్టులను లైనప్ లో పెట్టడం విశేషం. అందులో ఒకటైన హిట్ 4లో తమిళ స్టార్ కార్తీ హీరోగా నటించనున్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. కోర్ట్ దర్శకుడు రామ్ జగదీష్ తో మరో సినిమా ప్లాన్ చేస్తుండగా, దుల్కర్ సల్మాన్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయి. తన సోదరి దీప్తి ఘంటా దర్శకత్వంలో ఒక చిన్న బడ్జెట్ సినిమా కూడా నిర్మించబోతున్నారు నాని. మొత్తానికి హీరోగా వరుస హిట్స్ తో దూసుకుపోతున్న నానిడ నిర్మాతగా కూడా అదే సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తారా అన్న చర్చ మొదలైంది. కథలపై నమ్మకం, కొత్త టాలెంట్ కు అవకాశం, కంటెంట్ కు ప్రాధాన్యత.. ఇవన్నీ చూస్తుంటే వాల్ పోస్టర్ సినిమాస్ బ్యానర్ నుంచి మరోసారి విజయాల పరంపర కొనసాగడం ఖాయమే అనిపిస్తోంది. హీరోగానే కాదు.. నిర్మాతగానూ నాని డబుల్ దూకుడు చూపించడానికి సిద్ధమయ్యారనే చెప్పాలి.



పాలక్ తివారీ యొక్క బ్లాక్ గ్లామ్ మూమెంట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965